Email : telanganaveenaofficial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..




epaper.telanganaveena.com | హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక : 199 | ఆదివారం, మార్చి 31 2024 | పేజీలు - 8 | వెల : 3 రూ/..

### యువతకు ఉద్యోగావకాశాల కోసం

# పటిష్ఠ చర్యలు

**కాంగ్రెస్ రోజ్‌గార్ క్రాంతి తో పక్కా ప్రణాళిక**

**కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే**



**న్యూఢిల్లీ, తెలంగాణ వీణ:** కాంగ్రెస్ పార్టీ 'రోజ్‌గార్ క్రాంతి తీసుకువస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే శనివారం ప్రకటించారు. యువతకు ఉద్యోగావకాశాలు పెంచేందుకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటుందని, వారి ఆకాంక్షల సాఫల్యానికి, పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సాహానికి పార్టీ ఈ పథకం ద్వారా కృషి చేస్తుందని ఖర్గే హామీ ఇచ్చారు. కాంగ్రెస్ గ్యారంటీలతో యువత భవిష్యత్తు ఉజ్వలంగా మారుతుందని ఆయన చెప్పారు. పార్టీ అధికారంలోకి వచ్చిన పక్షంలో'యువ న్యాయ్' గ్యారంటీలను అమలు పరుస్తుందని ఖర్గే పునరుద్ఘాటించారు. 'కాంగ్రెస్ పార్టీ యువ న్యాయ్ గ్యారంటీ ద్వారా 'రోజ్‌గార్ క్రాంతి' తీసుకువస్తుంది. మన యువతకు ఉద్యోగావకాశాలు పెంపుదలకు, పరిశ్రమల స్థాపన దిశగా ప్రోత్సాహానికి, వారి కలలు, ఆకాంక్షల సాఫల్యానికి మేము పటిష్ఠమైన చర్యలు తీసుకుంటాం' అని ఖర్గే 'ఎక్స్'చ పోస్ట్‌లో హామీ ఇచ్చారు. 'యువ న్యాయ్' పథకం కింద పార్టీ ఇవ్వనున్న గ్యారంటీలను ఖర్గే వివరించారు. 'భారతీ భరోసా' గ్యారంటీ కింద తమ పార్టీ జాబ్ క్యాలెండర్ ప్రకారం 30 లక్షల కొత్త కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు కల్పిస్తుందని, 'పెహ్లీ నౌకీ పక్కీ'లో భాగంగా ఏడాదికి ఒక లక్ష రూపాయలు వంతున విద్యాధిక యువజనులు అందరికీ ఒక ఏడాది అప్రెంటిస్‌షిప్ హక్కు కల్పిస్తుందని ఖర్గే తెలియజేశారు.

### పార్టీ వీడుతున్న వారిపై

# అనర్హత

**స్పీకర్‌కు నోటీస్ ఇచ్చేందుకు బిఆర్ఎస్**

**హైదరాబాద్,తెలంగాణ వీణ:** తమ పార్టీ నుంచి గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరాలని భావిస్తున్న,చేరిన వారిపై అనర్హత వేటు వేయాలని బిఆర్ఎస్ భావిస్తోంది. ఇప్పటికే దానం నాగేందర్‌తో పాటు పలవురు కాంగ్రెస్‌లో చేరారు. కడియం శ్రీహరి కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్దం అయ్యారు. ఈ క్రమంలో చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ యోచిస్తోంది. అనర్హత వేటు వేయించే దిశగా బీఆర్ఎస్ ముందుకు సాగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కడియం శ్రీహరి స్టేషన్ ఘనపూర్ నుంచి పోటీ చేసి గెలిచారు. లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు తన కూతురు కడియం కావ్యకు టిక్కెట్ కూడా ఇప్పించుకున్నారు. కానీ కొన్ని రోజులకే వారు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌కు పిటిషన్ ఇచ్చేందుకు అసెంబ్లీకి వచ్చారు.

### ఫోన్ ట్యాపింగ్ కేసులో

# అధికారులపై చర్యలు

- ఇద్దరు అధికారులపై కొనసాగుతున్న విచారణ
- ఇద్దరినీ సస్పెండ్ చేసిన డిజిపి



**హైదరాబాద్, తెలంగాణ వీణ:** ఫోన్ ట్యాపింగ్ కేసులో అధికారులపై చర్యలకు ఉన్నతాధికారులు ఉపక్రమించారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్ట్ అయిన అడిషనల్ ఎస్పీలు తిరుపతన్న, భుజంగరావులపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు తెలంగాణ డీజీపీ రవి గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ప్రసుత్తం ఈ అధికారులు కస్టడి విచారణ ఎదుర్కొంటున్నారు. మరోవైపు బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే ఫోన్ టాపింగ్‌కు సంబంధించి కీలకమైన ఆధారాలను దర్యాప్తు బృందం సేకరించింది. శనివారం ఉదయం 8 గంటల నుంచి అడిషనల్ ఎస్పీలు తిరుపతన్న, భుజంగారావులను న్యాయవాది సమక్షంలో పోలీసులు విచారిస్తున్నారు. ఇక ఫోన్ టాపింగ్ కేసులో వీరిద్దరు కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. అలాగే వీరిద్దరి ఫోన్‌లో వాట్సాప్ చాటింగ్‌ని సైతం ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. ఇక ఇదే కేసులో మరో ఇద్దరు సిఐలను సైతం పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. రాధా కిషన్ రావు ఇచ్చిన సమాచారం మేరకే ఈ ఇద్దరిని దర్యాప్తు బృందం ప్రశ్నిస్తోంది.

# ఎండిన పంటల పరిశీలనకు కెసిఆర్

- నేడు జనగామ,భువనగిరి జిల్లాల్లో పర్యటన
- పంటలు పరిశీలించి రైతులతో ముఖాముఖి



**హైదరాబాద్, తెలంగాణ వీణ:** సాగునీరు అందక పంటలు ఎండిపో యి, అకాల వర్షాలతో దెబ్బతిని అల్లాడు తున్న రైతాంగానికి ధైర్యాన్ని నూరిపో సేందుకు బీఆర్ఎస్ అధినేత కే చంద్రశే ఖర్‌రావు స్వయంగా రంగంలోకి దిగుతు న్నారు. పలు జిల్లాల్లో ఎండిన పంటల ను పరిశీలించి రైతులను ఓదార్చను న్నారు. ఆదివారం ఆయన నేరుగా రైతు ల వద్దకు వెళ్లి, మీకు మేము అండగా ఉంటామన్న భరోసా కల్పించ నున్నారు. సూర్యాపేట, నల్లగొండ, జనగామ జిల్లాల్లోని పలు మండలాల్లో పర్యటించి, ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించనున్నారు. ఆదివారం ఉదయం 8:30 గంటలకు కేసీఆర్ ఎర్రవెల్లి నుంచి జిల్లాల పర్యటనకు రోడ్డు మార్గంలో బయల్దేరుతారు. జనగామ జిల్లాలోని ధరావత్ తండాకు ఉదయం 10:30 గంటలకు చేరుకుంటారు. అక్కడ ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించనున్నారు. 11:30 గంటలకు సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి మండలం, అర్వపల్లి మండలం, సూర్యాపేట రూరల్ మండలాల్లో పర్యటించి, ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు సూర్యాపేట రూరల్ మండలం నుంచి బయల్దేరి.. 1:30 గంటల వరకు సూర్యాపేట నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులోనే లంచ్ చేయనున్నారు. 3 గంటలకు ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3:30 గంటలకు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు నుంచి నల్లగొండ జిల్లాకు బయల్దేరుతారు. సాయంత్రం 4:30 గంటలకు నిడమనూరు మండలానికి చేరుకుని ఎండిపోయిన పంటలను పరిశీలించనున్నారు. సాయంత్రం 6 గంటలకు నిడమనూరు నుంచి ఎర్రవెల్లికి బయల్దేరనున్నారు.

### అట్టహాసంగా భారతరత్న

# పురస్కారాలు

**- పివికి భారతరత్నను అందుకున్న కుమారుడు - నేడు అద్వానీకి ఇంటికి వెళ్లి అందచేయనున్న రాష్ట్రపతి**

**న్యూఢిల్లీ, తెలంగాణ వీణ:** రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో దివంతగ ప్రధాని పివి నరసింహా రావుకు భారతరత్న పురస్కారం అందించారు. ఈ ఏడాది పలువురు ప్రముఖులకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారాలను ప్రకటించింది. వారిలో మాజీ ప్రధాని పీవీ నరసింహరావు, బీహార్ మాజీ సీఎం కర్పూరీ ఠాకూర్, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత ఎం ఎస్ స్వామినాథన్, మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ ఉన్నారు. న్యూఢిల్లీని రాష్ట్రపతి భవన్‌లో ఈ పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదగా ప్రదానం చేశారు. ఆ పురస్కారాలను వారి కుటుంబ సభ్యులు అందుకున్నారు. ఆ క్రమంలో పీవీ నరసింహరావుకు ప్రకటించిన భారతరత్న పురస్కారాన్ని ఆయన కుమారుడు పీవీ ప్రభాకరరావు అందుకున్నారు. చరణ్ సింగ్, స్వామినాథన్, కర్పూరీ ఠాకూర్‌ల పురస్కారాలను వారి కుటుంబ సభ్యులు అందుకున్నారు. ఈ భారతరత్న పురస్కార కార్యక్రమానికి ప్రధాని మోడీ,





అమిత్‌షాలతో పాటు పలువురు కేంద్ర మంత్రులతోపాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అద్వానీకి పురస్కారం ప్రకటించినా ఆరోగ్యం, వయసు పైబడడంతో ఆయన మాజరు కాలేదు. ఆయనకు ఆదివారం నేరుగా ఇంటికి వెళ్లి రాష్ట్రపతి స్వయంగా పురస్కారం అందిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రదాని మోడీ కూడా పాల్గొంటారు. ఆలస్యం అయినా మట్టిలో మాణిక్యం పీవీ నరసింహారావు కు భారతరత్న ఇవ్వడం మంచి పని అని ఆయన మనవడు పీవీ సుభాష్ న్యూఢిల్లీలో పేర్కొన్నారు. భారత ప్రధానిగా దేశం కోసం, ప్రజల కోసం ఆయన చేసిన మంచి సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి.. ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రకటించిందని తెలిపారు. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పీవీ నరసింహరావుకు ఎంత అన్యాయం జరిగిందో అందరికీ తెలిసిందేనని ఆయన చెప్పారు. ప్రధానిగా పీవీ నరసింహరావు చేసిన మంచి పనులను వారి ఖాతాలో వేసుకొని.. చెడు జరిగిందటూ పీవీని అవమానించారని ఆయన ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. అయితే పీవీకి భారతరత్న పురస్కారాన్ని ప్రకటించిన నేపథ్యంలో ప్రధాని మోదీకి ఈ సందర్భంగా సుభాష్ రావు ధన్యవాదాలు తెలిపారు. మా తండ్రి పీవీ నరసింహరావుకు భారతరత్న రావడం చాలా సంతోషంగా ఉందని ఆయన కుమార్తె శారదా దేవి వెల్లడించారు. పీవీకి భారతరత్న ప్రకటించడం పట్ల ఆయన కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.



### మీ పాలనలో బిసిలకు

# ఒరగబెట్టిందేమిటీ

**- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు పొన్నం సవాల్**



**హైదరాబాద్, తెలంగాణ వీణ:** : భారాస పాలనలో బడుగు, బలహీన వర్గాలకు ఏం న్యాయం చేశారో కేటీఆర్ చెప్పాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అధికారంలో ఉండగా మీరే అన్ని ముఖ్యమైన పదవులు చేపట్టి.. ఇప్పుడు కల్లబొల్లి మాటలు చెబుతున్నారని విమర్శించారు. బలహీన వర్గాలకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చాక కులగణన చేపట్టామన్నారు. భారాస పాలనలో జరిగిన మోసాలన్నీ ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన మోసాలు అన్ని బయటకు రావడంతో ఆ పార్టీ నేతలు అయోమయంలో పడ్డారని ప్రభాకర్ అన్నారు.

### అంతరాయం లేకుండా

# విద్యుత్ సరఫరా

**అధికారులను ఆదేశించిన సిఎం రేంవత్ రెడ్డి**



**హైదరాబాద్, తెలంగాణ వీణ:** రాష్ట్రంలో ఎలాంటి అంతరాయం లేకు డా విద్యుత్ సరఫరా చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. సచివాలయంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు సీఎం రేవంత్ రెడ్డి. వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రిజర్వాయర్లలో సరిపడా నీరుందని, నిరంతర నీటి సరఫరాపై దృష్టి పెట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. తాగునీటి సమస్య రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ఏప్రిల్, మే,జూన్ వరకు స్థానికంగా ఉన్న నీటి వనరులను ఉపయోగించుకోవాలని సూచించారు. బోర్ వెల్స్, బావులను తాగునీటి అవసరాలకు ఉపయోగించాలని ఆదేశించారు. నీటి వృథాపై ప్రజలకు అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఇబ్బంది తలెత్తకుండా చూడాలన్నారు. తెలంగాణలో అంతరాయం లేకుండా విద్యుత్తు సరఫరా చేయాలని తాగునీటికి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. ఎండాకాలం కావటంతో రాష్ట్రంలో విద్యుత్తు డిమా ండ్ పెరిగిందని, అందుకు సరిపడే విద్యుత్తును అందించేందుకు సన్నద్ధంగా ఉండాలని సూచించారు. డిమాండ్‌కు సరిపడేంత విద్యుత్తు అందుబాటులో ఉందని, కరెంటు పోయిందనే ఫిర్యాదు రాకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎక్కడైనా సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించాలని సూచించారు. గత ఏడాది కంటే రాష్ట్రంలో ఈ ఏడాది అత్యధికంగా విద్యుత్తును సరఫరా చేయటం కొత్త రికార్డును నమోదు చేసిందని అన్నారు

## నేషనల్ బాక్సింగ్ 3వ సబ్ జూనియర్ ఛాంపియన్ షిప్ లో

# సత్తా చాటిన తెలంగాణ బాల,బాలికలు






**తెలంగాణ వీణ/లాలాపేట్:**

ఐ వి రావు బాక్సింగ్ అకాడమీ అధ్వర్యంలో తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ సహకారంతో ఉత్తరప్రదేశ్ లోని నోయడా లో మార్చి 18 నుండి 25 వరకు జరిగిన నేషనల్ బాక్సింగ్ 3వ సబ్ జూనియర్ ఛాంపియన్ షిప్ లో తెలంగాణ బాల, బాలికలు సత్తాచాటారు.

లాలగూడ లో జరిగిన పత్రికా సమావేశంలో తెలంగాణ బాక్సింగ్ అకాడమీ వైస్ ప్రెసిడెంట్ మన్మోహన్, సెక్రటరీ రవీందర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ లక్ష్మణ్ లు మాట్లాడుతూ 40-45 కేజీల బాలుర విభాగంలో రమేష్ స్వప్నీల్ సిల్వర్ మెడల్,37-40 కేజీల బాలుర విభాగంలో యశ్వంత్ బ్రోన్స్ మెడల్ సాధించారు.67 కిలోల బాలికల విభాగంలో ఆయుష్మిత బెనర్జీ బ్రౌన్స్ మెడల్,64-67 కేజీల బాలికల విభాగంలో తనుశ్రీ బ్రౌన్స్ మెడల్ సాధించారు.మెడల్స్ సాధించిన బాల బాలికలను ప్రశంసించారు. బాల బాలికలకు ఇలాంటి బాక్సింగ్ కాంపిటీషన్లో పాల్గొన్నట్లయితే వారికి మానసిక శారీరక దారుణ్యం పెంపొందుతుందని తెలిపారు.

# ఈసీ మెంబర్ గా న్యాయవాది పెండ్యాల అనిల్ కుమార్

## ప్రాక్టీస్ మొదలుపెట్టిన అనతి కాలంలోనే అత్యున్నత పదవి

**తెలంగాణ వీణ / వరంగల్ ప్రతినిధి**



వరంగల్ జిల్లా కాశిబుగ్గ శాంతినగర్ ప్రాంతానికి చెందిన న్యాయవాది పెండ్యాల కొమురయ్య సరోజన ల రెండవ కుమారుడు అనిల్ కుమార్ తను చిన్నప్పటినుండి ఎంతో కష్టపడి చదువుకుని 2016వ సంవత్సరంలో హనుమకొండ లోని ఆదర్శ లా కాలేజి లో న్యాయవాద విద్యను అభ్యసించి 2019 లో హైకోర్టులో న్యాయవాదిగా ఎన్రోల్మెంట్ చేపించుకుని మన హనుమకొండ అదాలత్ లో రెగ్యులర్ గా న్యాయవాద ప్రాక్టీస్ ని ప్రారంభించి పేదవాళ్ళకి న్యాయ సహాయం న్యాయ సేవలు అందిస్తూ పలువురి చేత శభాష్ అనిపించుకుంటున్నాడు. తను చదువుకునే రోజుల నుండే తమ ప్రాంతానికి యూత్ అధ్యక్షుడిగా ఎన్నో సేవలందించాడు ఎన్నో సేవా కార్యక్రమాలు రక్త దానాలు చేస్తూ పలువురు దగ్గర మెప్పు పొందిన అనిల్ కుమార్ పెండ్యాల గతంలో ఎం ఎల్ ఎఫ్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కూడా నియమితులయ్యారు తెలంగాణ రాష్ట్ర వెయిటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (టి ఎస్ డబ్ల్యూ డబ్ల్యూ ఏ )కి అధ్యక్షులుగా ఉంటూ ఫంక్షన్ హాల్స్ లో పనిచేసే కూలీల సంక్షేమం కోసం పోరాడుతున్నారుప్రస్తుతం 2024 - 2025 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మక వరంగల్ కోర్టుకి సంబంధించిన న్యాయవాదుల ఎలక్షన్లలో వరంగల్ జిల్లా ఈసి మెంబెర్ గా పోటీ చేసి అత్యధిక మెజారిటీ తో గెలుపొందాడు. పలువురు సీనియర్ న్యాయవాదులు శ్రేయోభిలాషులు న్యాయవాది అనిల్ కుమార్ పెండ్యాల అభినందిస్తూ ప్రశంసిస్తున్నారు. న్యాయవాదిఅనిల్ కుమార్ పెండ్యాల భవిష్యత్తులో ఇంకా మరిన్ని పదవులు పొంది తమ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు

# వరంగల్ లోక్ సభ ఎంపీ ఇండిపెండెంట్ అభ్యర్థిగా బొచ్చు రాజు స్వేరో

**తెలంగాణ వీణ /వరంగల్ ప్రతినిధి**



రాజకీయాలపై ఆసక్తితో పరకాల మున్సిపాలిటీ పట్టణంలో 19వ వార్డు నుండి ఇండిపెండెన్స్ గా పోటీ చేసిన బొచ్చు రాజు సేర్వో గత కొన్ని సంవత్సరాల నుండి విద్యార్థుల సమస్యలపై పోరాడుతూ విద్యార్థి దశ నుండి రాజకీయ నాయకులుగా ఎదిగి ఈరోజు వరంగల్ లోక్ సభ ఎంపీ ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేయనున్నారు ఎస్సీ సామాజిక వర్గం నుంచి స్వచ్ఛంద పోటీ చేయడానికి గతంలో మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలుపుకు దగ్గరగా పరకాల మున్సిపాలిటీ పట్టణ ప్రజలు నన్ను ఒక అభ్యర్థిగా ప్రకటించిన గత ఎన్నికల్లో ఓటమిపాలైన సంగతి తెలిసిందే ఈసారి వరంగల్ లోక్ సభ స్థానానికి పోటీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు పరకాల మున్సిపాలిటీ ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలవగా బొచ్చు రాజు సేర్వో మూడో స్థానంలో నిలిచారు. ఆ ఎన్నికల తర్వాత ఆయన విద్యార్థుల ప్రజా సమస్యలపై పోరాడుతూ రాజకీయాన్ని వదిలిపెట్టకుండా ప్రజాసేవ చేయడానికి అంకితమయ్యారు అయితే వచ్చే లోక్ సభ ఎన్నికల్లో ఆయన ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటికి సిద్ధమయ్యారు మళ్లీ వరంగల్ నుంచి బరిలో దిగుతున్నారు అనే సందేహాలు రాజకీయ వర్గాల్లో నెలకొన్నాయి జిల్లాలో పర్యటిస్తున్న ఆయన తన రాజకీయ భవిష్యత్ పై స్పష్టతనిచ్చే ప్రయత్నం చేశారు వచ్చే లోక్ సభ ఎంపీ ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని స్పష్టం చేశారు అయితే ఏ పార్టీలో చేరబోనని, స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగుతానని వెల్లడించారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో విద్యార్థి దశ నుండి విద్యార్థులపై సమస్యల నుండి అలాగే ప్రతి నియోజకవర్గంలో సత్సంబంధాలు యువతను ఆకట్టుకునే మనస్తత్వం కలిగిన బొచ్చు రాజు సేర్వో జిల్లా కేంద్ర బిందువుగానే ఆయన కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రజా సమస్యలలో ఎంతో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. అందుకు వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పరకాల మున్సిపాలిటీ పట్టణంలో అంబేద్కర్ సెంటర్ రాజపేట కాలనీకి చెందిన బొచ్చు రాజు ను అత్యధిక మెజార్టీతో వరంగల్ లోక్ సభ ఎంపీ ఎలక్షన్లో ప్రజలు ఆశీర్వదించాలని ఆయన వేడుకున్నారు

# జగన్ బస్సుయాత్ర తుస్సు

## మద్యపాన నిషేధంపై ప్రజలకు చెప్పాలి - అబద్దాలు చెప్పి బుకాయించడం మానాలి - టిడిపి నేత దేవినేని ఉమ విమర్శలు

**అమరావతి,మార్చి30:** జగన్ చేపడుతున్న బస్సు యాత్ర తుస్ యాత్ర అయిందని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత దేవినేని ఉమ దెప్పిపొడిచారు. వైసీపీ ప్రభుత్వం చేస్తానన్న మద్యపాన నిషేధం హామీ ఏమైందని ప్రశ్నించారు. ఈ విషయంల ప్రజలకు ఎందుకు చెప్పడం లేదన్నారు. సీఎం జగన్‌రెడ్డి చెప్పిన అబద్దాలే మళ్లీ మళ్లీ చెప్పి ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారని మాజీమంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత దేవినేని ఉమ అన్నారు. తాను ఫ్రస్ట్ క్లాస్ స్టూడెంట్ అని శాసనసభలో జగన్ చెప్పారని... అబద్దాలు చెప్పడంలో జగన్ ఫస్ట్ క్లాస్ స్టూడెంటేనని ఎద్దేవా చేశారు. అబద్దాల్లో జగన్ పీహెచ్డీ తీసుకున్నారని సెటైర్లు గుప్పించారు. కరెంట్ ఛార్జీలు తగ్గిస్తానని తొమ్మిది సార్లు కరెంట్ ఛార్జీలు పెంచారని మండిపడ్డారు. తాడేపల్లి ప్యాలెస్‌కు ఇసుక, మద్యం మాఫియా సొమ్మును తరలించారని దేవినేని ఉమ ఆరోపించారు. శాండ్, ల్యాండ్, మైన్, వైన్ మాఫియాలతో డబ్బులు దండుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఏడు లక్షల మంది పిల్లలు ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లారని చెప్పారు. అమ్మఒడిలో ఏడు లక్షల మందికి కోత విధించారని అన్నారు. కమిషన్ల కోసమే నాడు-నేడు చేపట్టారని అన్నారు. జగన్ ఇద్దరు చెల్లెళ్లు రక్షా బంధన్ కట్టేందుకు సిద్ధంగా లేరన్నారు. ఈ కేసుపై ఇప్పుడు సీబీఐ విచారణ వద్దంటున్నారని చెప్పారు. బాబాయ్ హంతకులకే మళ్లీ టిక్కెట్ ఎలా ఇస్తారని చె÷-లలెళ్లు ప్రశ్నిస్తున్నారన్నారు. చాలా చోట్ల ప్యాలెస్సులు కట్టుకున్న జగన్ పేదవాడా..? అని నిలదీశారు. దేశంలో అత్యధిక ఇన్‌కంట్యాక్స్ కట్టేది సీఎం జగనేనని అన్నారు. జగన్ పేదవాడు.. మేం పెత్తందారులమా..? అని నిలదీశారు. అంగన్వాడీలు, ఆశా వర్కర్లు, హెల్త్ వర్కర్లు కనీసం ఓ సభ పెట్టుకునేందుకు కూడా అనుమతివ్వని జగన్ పేదల పక్షపాతా..? అని ప్రశ్నించారు. ప్రాజెక్టులను సీఎం జగన్ గాలికొదిలేశారని మండిపడ్డారు. కుప్పంలో నీళ్లిచ్చినట్లు డ్రామాలు ఆడి.. వెంటనే గేట్లు తీసుకెళ్లిన జగన్ రైతు పక్షపాతి ఎలా అవుతారని దేవినేని ఉమ ప్రశ్నించారు. రాయలసీమలో ప్రాజెక్టులు, రైతులను జగన్ నాశనం చేశారని టీడీపీ నేత దేవినేని ఉమ అన్నారు. పోలవరం నిర్వాసితులకు ఇస్తానన్న పునరావాసం ఏమైందని ప్రశ్నించారు. పోలవరం, రంపచోడవరం నియోజకవర్గాలల్లో ఓట్లు అడిగే అర్హత జగనుకుందా..? అని నిలదీశారు. ఏపీ రాజధాని పేరేంటో జగన్ చెప్పగలరా.. అని ప్రశ్నించారు. సీపీఎస్ రద్దును వైసీపీ గాలికి వదిలేసిందని మండిపడ్డారు. అమ్మఒడి ఎంతమందికైనా ఇస్తామని చెప్పి జగన్ మాట తప్పారని అన్నారు. ఆర్టీసీని కూడా నష్టపరిచేలా చేశారని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల గొంతును జగన్ కోసేశారన్నారు. రైతులకిచ్చే ధాన్యం డబ్బులను జగన్ దోచుకున్నారని ధ్వజమెత్తారు. కొడాలి నాని ధాన్యం డబ్బుల్లో జగనుకు కమీషన్ ఇచ్చారని విమర్శించారు. జగన్ అబద్దాల కోరని... వివేకా హత్య కేసులో ప్రధాన ముద్దాయి అవినాష్ రెడ్డిని పక్కన పెట్టుకున్నారని విరుచుకుపడ్డారు. కదిరి గొడ్డలి ఎక్కడుందో చెప్పాలని దేవినేని ఉమ ప్రశ్నించారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన 14వ డివిజన్ బిఆర్ఎస్ ఆర్ఎస్ నాయకులు





**తెలంగాణ వీణ /వరంగల్ ప్రతినిధి**

హనుమకొండ సుబేదారి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కాశీబుగ్గ ప్రాంతంలోని 14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ నగర్ సుందరయ్య నగర్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ నుంచి నాయకులు ఈర్ల రాజేందర్ పున్నం ఎల్లయ్య డబ్బా రాములు పిట్ట నగేష్ ఆర్మూర్ కుమార్ ఈర్ల రవి సంజయ్ సారంగం మహిళ నాయకురాలు నజుమా రేవతి కోమల యూత్ నాయకులు భారత్,పిట్ట సుధీర్ ప్రశాంత్ కిరణ్ వినయ్ సాయి తో పాటు సుమారు 50 మందిని కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించిన వర్ధన్నపేట శాసనసభ్యులు విశ్రాంత ఐపిఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఈ కార్యక్రమంలో 14వ డివిజన్ సీనియర్ నాయకులు ఎస్కే జావేద్ తో పాటు డివిజన్ నాయకులు కార్యకర్తలుతదితరులు పాల్గొన్నారు

## సఫలిగూడ పార్క్ లోని జిమ్ ను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్



**తెలంగాణ వీణ /మల్కాజిగిరి....** ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సూచనల మేరకు శనివారం సఫలీగూడలో జిమ్ సామాగ్రిని వీలైనంత త్వరగా రిపేర్ చేయించాలని ఎమ్మెల్యేతో మాట్లాడి పాడైపోయిన వాటర్ , డ్రోన్ స్ప్రెయింగ్ వర్క్ సామాగ్రిని , నూతనంగా ఏర్పాటు చేయాలని మాజీ కార్పొరేటర్ నిర్గుండా జగదీష్ గౌడ్, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు త్వరలో జిమ్ కావాల్సింది సామాగ్రిని ఏర్పాటు చేస్తామన్నారు

## సీఎం రిలీఫ్ ఫండ్




**తెలంగాణ వీణ, మల్కాజ్గిరి...** మల్కాజ్గిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నేరేడ్మెట్ డివిజన్ వెంకటేశ్వర నగర్ కాలనీకి చెందిన శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసి కి దరఖాస్తు చేసుకోగా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసి రూ 1,10,000/-, విలువగల మంజూరైన పత్రన్ని లబ్ధిదారురాలు శ్రీనివాస్ సతీమణి రమణి కి మల్కాజ్గిరి లిఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

## ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

**తెలంగాణ వీణ/అచ్చంపేట.** ఆర్టీసీలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలంగాణ ఆర్టీసీ ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంక్షేమ సంఘం నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య అన్నారు. శనివారం అచ్చంపేట పట్టణంలోని టీఎన్జీవో



భవనంలో అచ్చంపేట ఆర్టీసీ డిపో ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా డిపో నూతన కమిటీని ఎన్నుకున్నారు . సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ ఆర్టీసీలో ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామని అన్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా చిన్నయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గా హరిశ్చంద్ర నాయక్, ప్రధాన కార్యదర్శిగా తిరుపతయ్య ,ఉపాధ్యక్షులుగా నారాయణ, అంజనమ్మ ,అర్జున్ తదితరులను ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగ సంఘం నేతలు రత్నమ్మ ,ఇందిరమ్మ బాలస్వామి, మోహన్ లాల్ ,కాశన్న ఎంజి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని షాపూర్ నగర్ మార్కెట్ వద్ద జిహెచ్ఎంసి ఎలిమినేషన్ పాయింట్




**కుత్బుల్లాపూర్ /తెలంగాణ వీణ** షాపూర్ నగర్ మార్కెట్ వద్ద జిహెచ్ఎంసి వారి ఆధ్వర్యంలో ఎలిమినేషన్ పాయింట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇట్టి ప్రదేశంలో చెత్త వేస్తున్నారు అని ఇకమీదట ఇక్కడ చెత్త వేసినతో తగిన చర్యలు తీసుకుంటామని 1000 రూపాయలు జరిమానా విధిస్తామని జిహెచ్ఎంసి అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ దుర్గేష్,ఆర్ పి శ్రీదేవి, సి ఓ కనకమల్లు మరియు జిహెచ్ఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

## మన ఊరికి మన వాసన్న.....





**ఉంగుటూరు** మండలం, బొమ్మిడి గ్రామంలో మన ఊరికి మన వాసన్న కార్యక్రమంలో బాగంగా జగనన్న ప్రభుత్వం లో సంక్షేమం అభివృద్ధి ని తెలియచేస్తూ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కి మద్దతుగా ఫ్యాన్ గుర్తుకు ఓటేయమని ప్రజలను అభ్యర్థిస్తున్న ఉంగుటూరు శాసనసభ్యులు శ్రీ పుప్పాల వాసుబాబు గారు.

## తిరుమలలో పెరిగిన రద్దీ

**తిరుమల,మార్చి30:** ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో వారాంతపు సెలవుల కారణంగా తిరుమల లో భక్తుల రద్దీ పెరిగింది. శుక్రవారం గుడ్‌ఫ్రైడేతో పాటు శనివారం మినహా ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కొండపై ఉన్న కంపార్టుమెంట్లన్ని నిండిపోయాయి. సేవాసదన్ వరకు భక్తులు క్యూలైన్లో నిలబడ్డారు. టోకెన్లు లేని భక్తులకు 24 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు వివరించారు . నిన్న స్వామివారిని 60,958 మంది భక్తులు దర్శించుకోగా 31, 245 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా రూ. 3.41 కోట్లు వచ్చిందని తెలిపారు.

## కాంగ్రెస్ రాగానే 9 గ్యారెంటీల అమలు

### గడపగడపకు కార్యక్రమాన్ని ప్రారంభించిన షర్మిల

**విజయవాడ,మార్చి30:** కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగానే 9 గ్యారెంటీలు అమలు చేస్తామని ఆంధ్రప్రదేశ్ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల రెడ్డి ప్రకటించారు. గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి శనివారం నాడు ప్రారంభించారు. 9 గ్యారెంటీలకు సంబంధించిన కరపత్రం, డోర్ స్టిక్కర్ ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు 15 వందల అప్లికేషన్లు వచ్చాయని వివరించారు. దరఖాస్తు చేసుకున్న వారిపై సర్వే చేసి, రాష్ట్ర నాయకుల అభిప్రాయాలు తీసుకొని ఎంపిక చేస్తున్నామని పేర్కొన్నారు. 'కాంగ్రెస్ పార్టీ అంటే ప్రజల్లో ఒక నమ్మకం. రాష్ట్రానికి హోదా రావాలి. ఇప్పటికీ విభజన హామీలు అమలు కావడం లేదు. చంద్రబాబు బీజేపీతో 2014లో పొత్తు పెట్టుకొని విడాకులు తీసుకున్నారు. ఇప్పుడు మళ్లీ పొత్తు పెట్టుకున్నారు. జగన్‌ను నిర్మలా సీతారామన్ మోదీకి దత్తపుత్రుడు అన్నారు. ఒకరిది బహిరంగ పొత్తు.. మరొకరిది రహస్య పొత్తు. బాబుకి, జగన్ ఓటేస్తే బీజేపీకే ఓటు అని అర్థం అయ్యేలా చెప్పాలి. బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అని చెప్పాలి. ప్రత్యేక హోదా 10 ఏళ్లు కావాలని బాబు మోసం చేశాడు. అధికారం అనుభవించి రాష్ట్ర ప్రజలను మోసం చేశాడు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాజీనామాలు చేద్దాం అని చెప్పిన జగన్ ప్రజలను మోసం చేశాడు. హోదా వచ్చి ఉంటే రాష్ట్రం అభివృద్ధి జరిగి ఉండేది. వేల సంఖ్యలో పరిశ్రమలు వచ్చేవి. రాష్ట్ర ప్రజల గౌరవాన్ని జగన్ తాకట్టు పెట్టారు. హోదా ఇచ్చేది కాంగ్రెస్ పార్టీ మాత్రమే అని' షర్మిల స్పష్టం చేశారు.

## విశాఖలో వైకాపా భూకబ్జాలు

### వైసిపి నేతల తీరుపై మండిపడ్డ పాల్

**విశాఖపట్నం,మార్చి30:** విశాఖలో విలువైన భూములను వైసీపీ నాయకులు కబ్జాలు చేస్తున్నారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కేఏ పాల్ ఆరోపించారు. సీబీసీఎన్సీ క్రైస్తవ భూములలో కేఏ పాల్, బాబు మోహన్ సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎంవీవీ సత్యనారాయణ మనసు మార్చుకొని లాండ్స్‌ని బాపిస్ట్ సంఘాలకు సంబంధించిన యాజమాన్యానికి అప్పగించాలంటూ కేఏ పాల్ ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా సీబీ సీఎంసీ ల్యాండ్స్ రూ.550 కోట్లకి పైగా విలువ చేస్తాయని పేర్కొన్నారు. ఈ లాండ్స్ ను ఎంవీవీ సత్యనారాయణ కబ్జా చేసి నిర్మాణాన్ని చేపట్టారన్నారు. చట్ట విరుద్ధంగా ఈ బిల్డింగ్ కడుతున్నారని కేఏ పాల్ పేర్కొన్నారు. జగన్ అండదండలతోనే సీబీసీఎన్సీ ల్యాండ్స్‌లో నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాల మీద కేసులు వేసి గెలిచానన్నారు. తక్షణమే భూములను వెనక్కి ఇవ్వకపోతే మీ మీద కూడా లీగల్‌గా కేసులు పెడతానని ఎంవీవీని హెచ్చరించారు. సీఎం జగన్ గంగవరం పోర్ట్ ని 600 కోట్లకు అమ్మేశారన్నారు. 'కేఏ పాల్ సత్తా ఏంటో వైసీపీ నాయకులకి తెలియడం లేదు. 7 రోజులు సమయం ఇస్తున్నా.. సీబీసీఎన్సీ లాండ్స్.. క్రిస్టియన్ లాండ్స్‌ని వాళ్ళకు తిరిగి ఇచ్చేయ్యాలి..

## చరిత్రను వక్రీకరిస్తూ మతాల మధ్య వైషమ్యాలు సృష్టించే

# రాజాకార్ సినిమాను బ్యాన్ చేయాలి




**తెలంగాణ వీణ, కాప్రా :** మత విద్వేషాలు రెచ్చగొడుతున్న దుష్టశక్తుల ఆగడాలను తెలంగాణలో సాగనీయమని, చరిత్రను వక్రీకరిస్తూ మతాల మధ్య వైషమ్యాలు సృష్టించే రాజాకార్ సినిమాను బ్యాన్ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ కె. ధర్మేంద్ర పిలుపునిచ్చారు. ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సమావేశం హిమాయత్ నగర్ లోని సత్య నారాయణ రెడ్డి భవన్ లో రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర లు సంయుక్తంగా మాట్లాడుతూ గుజరాత్, ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రాలలో బీజేపీ ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొడుతూ చీలికలు తెచ్చి అశాంతిని నెలకొల్పుతున్నదని,అదే విధానాలను తెలంగాణ లో కూడా అమలు చేయాలని ప్రజల మధ్య మతం రంగు తో అల్లర్లు నిర్వహించాలని బీజేపీ కుట్రలు పన్నుతున్నదని ఈ దుష్ట చర్యలను రాష్ట్ర ప్రజలు తిప్పికొట్టాలని, బీజేపీ ని రాష్ట్రం నుండి తరిమికొట్టాలని వారు పిలుపునిచ్చారు. ఇటీవల మేడ్చల్ జిల్లా చెంగిచర్ల ప్రాంతంలో జరిగిన ఘటన అదే కోవలోకి వస్తుందని, రెండు మతాల మధ్య వైరుధ్యాలను సృష్టించి ఘర్షణలకు బీజేపీ తెరలేపిందని ఆరోపించారు. కేవలం ఎన్నికల సమయంలోనే బీజేపీ ఈ నీచపు అకృత్యాలకు పాల్పడటం సిగ్గు చేటు అన్నారు. అదే విధంగా రాజాకార్ సినిమాలో తప్పుడు చరిత్రను చూపిస్తున్నారని ధ్వజమెత్తారు. నిజాం వ్యతిరేక పోరాటం అంటే మతాన్ని, హిందూ ధర్మాన్ని, సనాతన ధర్మాన్ని రక్షించడానికి గ్రామాల్లో ప్రజలు తిరుగుబాటు చేశారనే అబద్దాలు చెప్పారని, కావాలనే ఒక వర్గం పట్ల వ్యతిరేక నినాదాలు చేర్చి ఈ సినిమాలో చూపించారని ధ్వజమెత్తారు. "మనుషులను చంపగలరు కానీ మా మతాన్ని, హిందువులను చంపలేరు" అనే డైలాగులతోనే వివాదం చేస్తున్నారన్నారు. ఆనాడు ప్రజలు సాధారణంగా ఆంధ్ర మహాసభ జిందాబాద్ అన్నారే, కానీ, కనీస ప్రస్తావన లేని 'వైదిక మతం జిందాబాద్' అనే నినాదాలు గ్రామాలలో ఇచ్చినట్లు, ఈ సినిమాలో చూపించారన్నారు. మత కోణంలోనే ఈ పోరాటం జరిగితే విస్నూర్ రాంచంద్ర రెడ్డి గుండాలు చంపిన షేక్ బందగీ, రజాకార్లు చంపిన ముస్లిం జర్నలిస్ట్ షోయబుల్లా ఖాన్ ఎవరో చెబుతారా? గ్రామాల్లో అరాచకాలకు కేరాఫ్ అడ్రస్ అయిన రజాకార్ల సైన్యానికి అధ్యక్షుడు ఖాసిం రజ్వీ అయితే, ఉపాధ్యక్షుడు విస్నూరు రామచంద్రారెడ్డి అనేది తెలియదా? ప్రజలపై దాడులు చేయించిన,ప్రజలను పీడించిన రజాకార్లకు విడిది ఈ దొరల గడీలే అన్న సంగతి తెలియదా? అన్నదమ్ములాగ కలసి అన్ని మతాల, కులాల వారు చేసిన వీరోచిత పోరాటానికి మతం రంగు పులిమే ఎవరైనా దేశ భక్తులు ఎలా అవుతారని వారు ప్రశ్నించారు. అశేష త్యాగాలు చేసిన కమ్యూనిస్టుల త్యాగాల గురించి ఈ సినిమాలో ఎక్కడా చూపించలేదని విమర్శించారు. కమ్యూనిస్టుల నాయకత్వంలోనే ప్రజలు గ్రామ రక్షణ దళాలను ఏర్పాటు చేసుకోని పోలీసు, రజాకార్ల దాడులను తిప్పికొట్టారని గుర్తుచేశారు. గెరిల్లా దళాలు ఏర్పాటు చేసి బందూకు శిక్షణ నేర్పింది కమ్యూనిస్టులేని వారు ఉద్ఘటించారు. ఈ దెబ్బతో దొరలు గ్రామాల నుండి పారిపోయారని, కమ్యూనిస్టులు భూసంస్కరణలు అమలు జరిపి 12 లక్షల ఎకరాల భూమి పంచారన్నారు. వెట్టి చాకిరి, బానిస విధానం రద్దైంది, రుణాలు, రుణ పత్రాలు, అప్పులు, వడ్డీలు రద్దయ్యాయని, స్త్రీలకు సమాన హక్కులు కల్పించబడ్డాయన్నారు. అంటరానితనం పోయి, కుల, మత వివక్షత లేకుండా కలిసికట్టుగా దొరలపై నాడు పోరాటం చేశారన్నారు. కమ్యూనిస్టు పోరాటం వలన గ్రామాల్లో పీడన, బానిసత్వం నుండి విముక్తి దొరికిందన్నారు. "దున్నేవాడికే భూమి" అనే నినాదం కమ్యూనిస్టులదని, దోపిడీకి వ్యతిరేకంగా భూస్వాములపై ఎర్రజెండా నీడలో పోరాడారన్నారు. గడీలు బద్దలు కొట్టి ప్రజలంతా కుల, మతాలకతీతంగా నిజాంపై పోరాడిన చరిత్ర కమ్యూనిస్టులదని వారు అన్నారు. ఈ మట్టి మనుషుల త్యాగాల చరిత్ర వక్రీకరించడం, కేవలం మతకోణంలో ఈ పోరాటాన్ని చూపడం దుర్మాగపు చర్యఅని, పీడనకు వ్యతిరేకంగా పీడితులు చేసిన గొప్ప పోరాటం నేటి మన తరాలకు ఆదర్శమని అన్నారు. అసలైన చరిత్ర పేరుతో ఈ వక్రీకరణలను చేస్తున్న కుట్రలను తెలంగాణ రాష్ట్ర యువత, ప్రజలు తిప్పికొట్టాలని, చరిత్ర ను వక్రీకరించే దుష్టశక్తులను భూగర్భంలో పాతరవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ కునుకుంట్ల శంకర్, బిజ్జ శ్రీనివాసులు, టి. సత్య ప్రసాద్, పేరబోయిన మహేందర్, శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

# తూర్పులో ప్రధాన పార్టీల అభ్యర్థుల ఖరారు

### ప్రచారానికి సిద్ధం అంటున్న పోటీచేస్తున్న నేతలు

**కాకినాడ,మార్చి30:** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రధాన పార్టీల నుంచి పోటీ చేయబోయే అభ్యర్థులపై స్పష్టత వచ్చింది. ఆయా నియోజకవర్గాల్లో పోటీ చేయబోతున్న అభ్యర్థులు ఖరారు కావడంతో ప్రచారంలో దూసుకు పోయేందుకు సిద్ధం అంటున్నారు. అధికార వైసీపీతోపాటు కూటమిలోని పార్టీలు కూడా అనేక అంశాలను పరిగణలోకి తీసుకుని, లెక్కలు వేసి మరీ అభ్యర్థులను ఎంపిక చేశాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని అసెంబ్లీ స్థానాలు నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు, ఆసక్తిని కలిగిస్తున్న నియోక జవర్గాలు గురించి ఈ కథనంలో తెలుసుకుందాం. తూర్పుగోదావరి జిల్లాలోని పి.గన్నవరం నియోజకవర్గంలో అధికార వైసీపీ నుంచి విప్పర్తి వేణుగోపాల్ పోటీ చేస్తుండగా, కూటమి నుంచి జనసేన అభ్యర్థిగా గిడ్డి సత్యనారాయణ బరిలో నిలిచారు. అమలాపురం నుంచి మంత్రి పినెపే విశ్వరూప్ పోటీ చేస్తున్నారు. కూటమి అభ్యర్థిగా టీడీపీకి చెందిన అయితాబత్తుల ఆనందరావు పోటీ చేస్తున్నారు. గతంలో ఈయన ఎమ్మెల్యేగా కూడా పని చేశారు. రాజోలు నుంచి మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు వైసీపీ నుంచి బరిలోకి దిగుతున్నారు. కొద్దిరోజులు కిందట వరకు టీడీపీలో ఉన్న ఈయనకు ఆ పార్టీ టికెట్ నిరాకరించ డంతో వైసీపీలో చేరారు. ఆయనకు వైసీపీ అధిష్టానం రాజోలు సీటును కేటాయించింది. ఇక్కడ సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న రాపాక వరప్రసాదరావును అమలాపురం ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. కూటమి అభ్యర్థిగా దేవ వరప్రసాద్ పోటీ చేస్తున్నారు. ముమ్మిడివరం నుంచి వైసీపీ అభ్యర్థిగా సిటింగ్ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పోటీ చేస్తుండగా, కూటమి అభ్యర్థిగా టీడీపీకి చెందిన దాట్ల సుబ్బరాజు పోటీ చేస్తున్నారు. కొత్తపేట నుంచి వైసీపీ అభ్యర్థిగా చిర్ల జగ్గిరెడ్డి పోటీ చేస్తుండగా, కూటమి అభ్యర్థిగా టీడీపీకి చెందిన బండారు సత్యానందరావు పోటీ చేస్తున్నారు. రాజానగరం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పోటీ చేస్తున్నారు. కూటమి అభ్యర్థిగా జనసేనకు చెందిన బత్తుల బలరామకృష్ణ బరిలో ఉన్నారు. రామచంద్రాపురం నుంచి మాజీ మంత్రి, ప్రస్తుత రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ కుమారుడు పిల్లి సూర్యప్రకాష్ పోటీ చేస్తున్నారు. కూటమి అభ్యర్థిగా టీడీపీకి చెందిన వాసంశెట్టి సుభాష్ బరిలో ఉన్నారు.

ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా వరుపుల సుబ్బారావు పోటీ చేస్తున్నారు. టీడీపీ నుంచి కూటమి అభ్యర్థిగా వరుపుల సత్యప్రభ పోటీ చేస్తున్నారు. తునినుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి దాడిశెట్టి రాజా పోటీ చేస్తుండగా, కూటమి అభ్యర్థిగా టీడీపీ నుంచి మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు కుమార్తె దివ్య బరిలోకి దిగుతున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో అత్యంత ఆసక్తిని కలిగిస్తున్న నియోజకవర్గం పిఠాపురం. రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా యావత్ తెలుగు ప్రజలకు ఆసక్తిని కలిగిస్తున్న నియోజకవర్గం ఇది. ఇక్కడి నుంచి కూటమి అభ్యర్థిగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ పోటీ చేస్తున్నారు. అనేక అంశాలు, లెక్కలను పరిగణలోకి తీసుకున్న తరువాత పవన్ కల్యాణ్ ఇక్కడ పోటీ చేస్తున్నారు. ఈయనపై అధికార వైసీపీ నుంచి అమలాపురం సిట్టింగ్ ఎంపీగా ఉన్న వంగా గీత పోటీ చేస్తున్నారు. పెద్దాపురం నుంచి అధికార వైసీపీ నుంచి దావులూరి దొరబాబు పోటీ చేస్తుండగా, సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మాజీ హోంమంత్రి నిమ్మకాయల చినరాజప్ప కూటమి అభ్యర్థిగా టీడీపీ నుంచి పోటీ చేస్తున్నారు. రాజమండ్రి రూరల్ నుంచి మంత్రి చెన్నుబోయిన వేణుగోపాలకృష్ణ పోటీ చేస్తుండగా, కూటమి అభ్యర్థిగా టీడీపీ నుంచి మాజీ మంత్రి, సిట్టింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పోటీ చేస్తున్నారు. అనపర్తి నుంచి వైసీపీ అభ్యర్థిగా డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పోటీ చేస్తుండగా, కూటమి అభ్యర్థిగా

బీజేపీ నుంచి రామకృష్ణంరాజు పోటీ చేస్తున్నారు. జగ్గంపేట నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి తోట నర్సింహం బరిలోకి దిగుతున్నారు. కూటమి అభ్యర్థిగా టీడీపీ నుంచి జ్యోతుల వెంకట అప్పారావు(నెహ్రూ) పోటీ చేస్తున్నారు. మండపేట నుంచి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా టీడీపీకి చెందిన వేగుళ్ల జోగేశ్వరరావు పోటీ చేస్తుండగా, అధికార వైసీపీ నుంచి మాజీ మంత్రి తోట త్రిమూర్తులు పోటీ చేస్తున్నారు. కాకినాడ రూరల్ నియోకజవర్గం నుంచి మాజీ మంత్రి, సిట్టింగ్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పోటీ చేస్తున్నారు. కూటమమి అభ్యర్థిగా జనసేనకు చెందిన పంతం నానాజీ పోటీ చేస్తున్నారు. రాజమండ్రి అర్బన్ నుంచి సిట్టింగ్ ఎంపీగా ఉన్న మార్గాని భరత్ వైసీపీ నుంచి పోటీ చేస్తుండగా, కూటమి అభ్యర్థిగా టీడీపీకి చెందిన ఆదిరెడ్డి వాసు పోటీ చేస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని భర్త ఈ వాసు. కాకినాడ అర్బన్ నియోకజవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పోటీ చేస్తుండగా, కూటమి అభ్యర్థిగా టీడీపీకి చెందిన వనమాడి వెంకటేశ్వరరావు పోటీ చేస్తున్నారు. రంపచోడవరం నుంచి వైసీపీ అభ్యర్థిగా నాగులపల్లి ధనలక్ష్మి పోటీ చేస్తుండగా, కూటమి అభ్యర్థిగా టీడీపీకి చెందిన మిర్యాల శిరీష పోటీ చేస్తున్నారు.

# పాలనపై సోయిలేని సిఎం రేవంత్

### మీడియా సమావేశంలో ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి విమర్శలు

**నల్లగొండ,మార్చి30:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలనపై సోయి లేదని మాజీ మంత్రి, సూర్యాపేట బిఆర్ఎస్ జగదీశ్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. పంటలు ఎండిపోయి రైతులు అల్లాడుతుంటే కనీసం సమీక్ష కూడా చేయడం లేదన్నారు. ఇదేనా పాలన అంటే అని విమర్శించారు. నల్గొండ జిల్లా కేంద్రంలో జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, ఎంపీ లింగయ్య యాదవ్, ఎంపీ అభ్యర్థి కృష్ణారెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ ఆదివారం నల్లగొండ జిల్లాలో పర్యటిస్తారని తెలిపారు. ఉదయం 9గంటలకు బయలుదేరి భువనగిరి మీదుగా జనగామ వెళ్తారన్నారు. మొదట దేవరప్పులలో ఎండిన పంటలను పరిశీలిస్తారని చెప్పారు. ఆ తర్వాత సూర్యాపేట జిల్లాలోని అర్వపల్లి, తుంగతుర్తి మండలాల్లో ఎండిన పంటలను పరిశీలిస్తారన్నారు. అనంతరం సూర్యాపేట పట్టణంలోని జనగామ రోడ్‌లోని పంటలను పరిశీలిస్తారన్నారు. సూర్యాపేటలో మీడిఆయాతో మాట్లాడుతారని అన్నారు. అక్కడి నుంచి హాలియా, మిర్యాలగూడ రోడ్ పక్కన ఉన్న సాగర్ ఆయకట్టులో ఎండిన పొలాలను పరిశీలించి.. హైదరాబాద్‌కు బయలుదేరుతారన్నారు. ఆరోగ్యం బాగా లేకున్నా రైతుల కష్టాలు చూడలేక కేసీఆర్ ఆదివారం అన్నదాతల వద్దకు వస్తున్నారన్నారు. రేవంత్‌కి పరిపాలనపై సోయిలేదని.. ఇప్పటివరకు వ్యవసాయంపై సమీక్ష లేదని.. మంత్రి కూడా సమీక్ష చేయలేదరన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కేసీఆర్ ఉంటే భూమి ఆకాశనీ ఒక్కటి చేసైనా సరే అన్నదాతలకు నీళ్లు అందించేవారన్నారు. కానీ, ఇవాళ దరిద్రమైన ప్రభుత్వం ఉన్నదన్నారు. రాష్ట్రంలో నీళ్లు అందక లక్షల ఎకరాలు ఎండిపోయా యని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు మోర పెట్టుకున్నా ప్రభుత్వంలో కదలిక లేదన్నారు. నీళ్లు ఇచ్చే అవకాశం ఉన్నా ఇవ్వలేదని.. ప్రభుత్వం నిర్లక్ష్యంతో అన్నదాతలు ఆగం అయ్యారన్నారు. ÷శిసీఆర్‌పై కోపంతో రైతులను బలి పెట్టారు కాంగ్రెస్ వాళ్లు.. సాగర్‌లో డెడ్ స్టోరేజ్ నీళ్లు ఉన్నా అప్పుడు నీళ్లు అందించామన్నారు. అన్నదాతలను కాపాడుకున్నామని.. కానీ, ఇప్పుడు పట్టించుకునే నాథుడే లేడని.. ఎస్సారెస్పీ కింద సూర్యాపేట జిల్లాలో నీళ్లు ఇస్తామన్నారు. పంటలు సాగు చేయండని చెప్పి మరి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. నీళ్లు ఇవ్వక ఎక్కడికక్కడ ఎండిపోయాయని అన్నారు. జిల్లా మంత్రులు అక్రమ వసూళ్లు, దందాలు మొదలుపెట్టారని మండిపడ్డారు. మిల్లర్లను బెదిరింపు చేసి కోట్లు వసూలు చేశారని.. మిల్లర్లు ఏమో అన్నదాతలను పీక్కోని తింటున్నరని విమర్శించారు. కోమటిరెడ్డి ఓ బడ్డారఖాన్.. ఓ జోకర్.. ఆయన మాటలకు ఎక్కడ విలువ లేదన్నారు. ఎంపీ లింగయ్య యాదవ్ రేవంత్ రెడ్డి సీఎం ఉడడం లేదన్నారు. దౌర్భాగ్యం జిల్లాలో నష్టపోయిన రైతులకు అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం మెడలు వంచుతామన్నారు. కేసీఆర్ జిల్లాలో పర్యటిస్తున్నారని, రైతుల అండగా ఉంటారన్నారు. పరిపాలన చేతకాక రేవంత్ అడ్డగోలుగా ఆరోపణలు చేస్తున్నాడని మండిపడ్డారు. ప్రజలు కాంగ్రెస్ నయవంచనను అర్థం చేసుకోవాలని కోరారు. రేపటి ఎన్నికల్లో ప్రజలు నిలదీస్తే సమస్యలు తెలుస్తాయని అన్నారు. రైతులకు ఏం సమాధానం చెబుతారో చూస్తామని అన్నారు.

# కొండెక్కిన నిమ్మ ధరలు..
# నెల రోజుల్లో 350 శాతం అధికం

**హైదరాబాద్ :** వేసవి ఎండలు రోజు రోజుకూ మండిపోతుండటంతో తాపాన్ని తగ్గించుకునేందుకు జనం వివిధ రకాల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో మార్కెట్లో నిమ్మకాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. గతంలో రూ.20కి లభ్యమైన అరడజను పెద్దసైజు నిమ్మకాయలు.. ఇప్పుడు రూ.40 వరకు పలుకుతున్నాయి. విడిగా అయితే ఒక్కో నిమ్మకాయను రూ.10, చిన్న సైజుదైతే రూ.5 చొప్పున వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఈ ధరలను చూసి సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. నిమ్మకాయల ఉత్పత్తి తగ్గడం, డిమాండ్ పెరగడం ఇందుకు కారణం. నిమ్మసాగు అధికంగా జరిగే కర్ణాటకలో ఈ ఏడాది ఉత్పత్తి దాదాపు 40 శాతం తగ్గింది. దీంతో ఆ రాష్ట్రంలో హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లలో ధరలు భారీగా పెరిగాయి.నెల రోజుల క్రితం హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.2 వేలు పలికిన 1,000 పెద్దసైజు నిమ్మకాయలకు ఇప్పుడు ఏకంగా రూ.7 వేలకుపైగా చెల్లించాల్సి వస్తున్నది. అంటే ఈ నెల రోజుల్లోనే నిమ్మకాయల ధరలు 350 శాతం పెరిగినట్టు స్పష్టమవుతున్నది. దేశంలో నిమ్మసాగు ఎక్కువగా ఏపీ, కర్ణాటక, తెలంగాణలో జరుగుతుంది. ఏటా ఏపీలో దాదాపు 7, కర్ణాటకలో 3, తెలంగాణలో 1.5 లక్షల టన్నుల దిగుబడి వచ్చేది. రైతుల నుంచి వీటిని కొనుగోలు చేసిన వ్యాపారులు స్థానికంగా అమ్మడంతోపాటు సూరత్, అహ్మదాబాద్, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై మీదుగా విదేశాలకు ఎగుమతి చేసేవారు. కానీ, ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల నిమ్మ దిగుబడి భారీగా తగ్గినట్టు అధికారులు చెప్తున్నారు.



# కాచిన నూనెలతో మెదడుకు ముప్పు..
# క్యాన్సర్, కాలేయ వ్యాధులకు దారితీసే ప్రమాదం

**హైదరాబాద్ :** కాచిన నూనెలతో మళ్లీ వంటలకు వినియోగిస్తే మెదడుకు ముప్పు తప్పదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాలేయ, క్యాన్సర్‌తోపాటు ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు దారితీసే అవకాశమున్నదని స్పష్టం చేశారు. ఇటీవల నిర్వహించిన ఏఎస్‌ఎఫ్‌బీఏఎంబీ (అమెరికన్ సొసైటీ ఫర్ బయో కెమిస్ట్రీ అండ్ మాలిక్యులర్ బయాలజీ) వార్షిక సమావేశంలో ఈ అధ్యయానికి సంబంధించిన నివేదికను వెల్లడించారు.

ఈ పరిశోధనల్లో నూనెకు, మెదడు ఆరోగ్యానికి మధ్య ఉన్న సమస్యల గురించి వెల్లడైంది. ఎలుకలపై పరిశోధనలు నిర్వహించినట్టు వారు తమ నివేదికలో వెల్లడించారు. కొన్ని ఎలుకలకు సాధారణ ఆహారం ఇవ్వగా, మరికొన్నింటికి కాచిన నూనెతో చేసిన ఆహారం ఇచ్చారు. ఈ రెండింటినీ పోల్చి చూస్తే.. కాచిన నూనెతో చేసిన ఆహారం తిన్న ఎలుకల్లో మెదడు అనారోగ్య ముప్పును ఎదుర్కొన్నాయని పరిశోధకులు తెలిపారు. కాచిన నూనెతో చేసిన వంటల వినియోగంతో శారీరక సమతుల్యత దెబ్బ తింటుందని గుర్తించారు.కీలకమైన జీర్ణ వ్యవస్థ, కాలేయాన్ని దెబ్బతీస్తుందని తేలింది. ఈ నూనె కారణంగా క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని పలువురు ఆరోగ్య నిపుణులూ హెచ్చరిస్తున్నాన్నారు.

ఇది ఫ్రీ రాడికల్స్ ముప్పు పెంచుతుందని, దీనివల్ల దేహంలో వాపు ఏర్పడి ఎన్నో అనారోగ్య సమస్యలకు కారణమవుతుందని పేర్కొంటున్నారు. ఇప్పుడు తాజా పరిశోధన కూడా వాటిని నిరూపిస్తున్నదని పరిశోధకులు వెల్లడించారు. పదే పదే వేడిచేసిన నూనెలతో చేసిన వంటలతో



మనిషి శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలూ పెరగుతాయని, దీర్ఘకాలిక రోగాలు వేధిస్తాయని పరిశోధకులు చెప్తున్నారు. ఈ ప్రమాదాలను తగ్గించుకోవడానికి.. ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్లు, ప్రోబయోటిక్స్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని వారు పేర్కొంటున్నారు.

## నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు..
### మళ్లీ యూనివర్సిటీలకు 40ం వయస్కులు



న్యూఢిల్లీ, మార్చి 29: కృత్రిమ మేధ రాకతో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. అందుకు తగ్గట్టుగా నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు తమ దేశ ప్రజలను సింగపూర్ మళ్లీ యూనివర్సిటీల బాట పట్టిస్తున్నది. ఇందుకోసం పూర్తికాల డిప్లొమా కోర్సును రూపొందించింది. 40 ఏండ్ల పైబడిన వారు ఈ కోర్సులు చదవడానికి 90 శాతం ఫీజు రాయితీ కూడా అందిస్తున్నది.

ప్రస్తుతం 40 ఏండ్ల పైబడిన ఉద్యోగులు తాము 20 ఏండ్ల క్రితం చదువుకున్న చదువులకు, ఇప్పటి చదువులకు ఎంతో మార్పు ఉంటుందని ఆ దేశ పార్లమెంట్ ఎంపీ టాన్ ఊ మెంగ్ తెలిపారు. 'అనుభవజ్ఞులైన ఉద్యోగులు తమ జీవితానుభవాలను. జీవన నైపుణ్యాలను తరగతి గదిలోకి తీసుకొస్తారు. అలాగే యువ విద్యార్థులతో కలిసి వారు కొత్త నైపుణ్యాలు నేర్చుకొంటారు' అని మెంగ్ అభిప్రాయపడ్డారు.

## అరేబియా సముద్రంలో ఇరాన్ చేపల బోటు హైజాక్..
### 23 మంది పాకిస్థానీలను రక్షించిన ఇండియన్ నేవీ



**న్యూఢిల్లీ:** అరేబియా సముద్రంలో హైజాక్ అయిన ఇరాన్ చేపల బోటును, అందులో ఉన్న సిబ్బందిని ఇండియన్ నేవీ రక్షించింది. సుమారు 12 గంటలపాటు సాగిన ఈ ఆపరేషన్‌లో పాకిస్థాన్‌కు చెందిన 23 మంది సిబ్బందిని రక్షించినట్లు అధికారులు వెల్లడించారు. సముద్రాల్లో యాంటీ పైరసీలో భాగంగా ఈ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టినట్లు తెలిపారు. గల్ఫ్ ఏడెన్‌కు సమీపంలో ఉన్న సోకోట్రా ద్వీపసమూహానికి 90 నాటికల్ మైళ్ల దూరంలో ఇరాన్‌కు చెందిన చేపల బోటు గురువారం హైజాక్‌కు గురైందని, తొమ్మిది మంది సముద్ర పైరేట్స్ పడవను తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు సమాచారం అందిందని శుక్రవారం రాత్రి భారత నేవీ ప్రకటించింది. ఆ బోటును, సిబ్బందిని రక్షించేందుకు ప్రత్యేక ఆపరేషన్ చేపడుతున్నట్లు వెల్లడించింది.

# దానం నాగేందర్‌కు 'హ్యాండ్'?..
# సికింద్రాబాద్ టికెట్‌పై కాంగ్రెస్

**హైదరాబాద్ :** ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండానే కాంగ్రెస్ నుంచి సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఖరారైన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హ్యాండ్ ఇచ్చే అవకాశం ఉన్నట్టు ఆ పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తేగానీ ఎంపీగా పోటీ చేయొద్దని అధిష్ఠానం మెలిక పెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. కానీ వాస్తవానికి అది కారణమే కాదని, కాంగ్రెస్ తాజాగా నిర్వహించిన ఫ్లాష్ సర్వేలో దానం నాగేందర్ అభ్యర్థిత్వానికి కంటే మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కే ఓటర్లు అనుకూలంగా ఉన్నట్టు తేలిందని ఆయా వర్గాల సమాచారం. ఈ విషయాన్ని అధిష్ఠాన పెద్దలు బయటికి





చెప్పకుండా, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తేనే ఎంపీగా పోటీ చేయాలని దానం నాగేందర్‌కు కండీషన్ పెట్టినట్టు తెలిసింది. ఎంపీగా పోటీ చేసి గెలిచాకే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడానికి కాంగ్రెస్ పెద్ద లు అంగీకరించాకే పార్టీ కండువా కప్పుకున్నానని, ఇప్పుడేమో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని షరతు పెట్టడమేంటని దానం నాగేందర్ మొండికే స్తున్నట్టు సమాచారం. ఇదే కారణంతో సికింద్రా బాద్‌కు అభ్యర్థిని మారుస్తారనే ప్రచారం జరుగు తుందని ఆయన అభిప్రాయపడ్డారు .శ్రీహరి, కావ్యకు ఆహ్వానంఉమ్మడి వరంగల్ జిల్లా స్టేషన్ ఘనపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని తమ పార్టీలో చేరాలని కాంగ్రెస్ పార్టీ నేతల బృందం ఆహ్వానించింది.

## ఏప్రిల్ 1న జేఈఈ మెయిన్ సెషన్-
## 2 అడ్మిట్ కార్డులు!



**న్యూఢిల్లీ:** జేఈఈ మెయిన్ రెండో సెషన్ పరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డులు మరో రెండు రోజుల్లో విడుదల కానున్నాయి. ఏప్రిల్ 1న అడ్మిట్ కార్డులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేయనున్నట్లు తెలుస్తున్నది. జేఈఈ మెయిన్ సెషన్-2 పరీక్షలు వచ్చే నెల 4 నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 15 వరకు రోజూ రెండు సెషన్లలో దేశవ్యాప్తంగా 319 పట్టణాల్లో ఎగ్జామ్‌ను నిర్వహిస్తారు. భారత్ అవతల 22 పట్టణాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.ఏప్రిల్ 4, 5, 6, 8, 9 తేదీల్లో పేపర్-1 (బీఈ లేదా బీటెక్) పరీక్షను, పేపర్-2 ఏ (బీఆర్క్), పేపర్-2బీ (బీఆర్క్, బీప్లానింగ్) పరీక్షను ఏప్రిల్ 12న నిర్వహిస్తారు. అదే నెల 25న ఫలితాలు వెలువడనున్నాయి. కాగా,

జేఈఈ మెయిన్ సెషన్-1 గత జన వరిలో ముగిసిన విషయం తెలిసిందే. మొదటి విడుతలో 23 మంది విద్యార్థులు 100 పర్స ంటైల్ మార్కులు సాధించారు. వారిలో అత్యధికంగా తెలంగాణ నుంచి ఏడుగురు ఉన్నారు. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్‌కు చెందిన ముగ్గురు చొప్పున 100 పర్సంటైల్ స్కోర్ చేశారు.

## ట్రంకు పెట్టెల్లో కోర్టుకు డాక్యుమెంట్ల తరలింపు.. న్యూస్‌క్లిక్ కేసులో ఛార్జ్‌షీట్ దాఖలు





**న్యూఢిల్లీ:** న్యూస్ పోర్టల్ న్యూస్‌క్లిక్ పై ఇవాళ ఢిల్లీ పోలీసులు పాటియాలా హౌజ్ కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. రెండు ట్రంకు పెట్టెల్లో ఆ ఛార్జ్‌షీట్ డాక్యుమెంట్లను కోర్టుకు తీసుకువచ్చారు. సుమారు 8 వేల పేజీల ఛార్జ్‌షీట్ ఉన్నట్లు తెలుస్తోంది. ఆ వెబ్‌సైట్‌కు చెందిన ఎడిటర్లు, వ్యవస్థాపకులు, ఉద్యోగుల పేర్లను ఆ ఛార్జ్‌షీట్‌లో నమోదు చేశారు. అమెరికా వ్యాపారవేత్త నివెల్లి రాయ్ సింఘం పేరును కూడా ఆ ఛార్జ్‌షీట్‌లో జోడించినట్లు తెలుస్తోంది. చైనాకు అనుకూల ప్రచారం నిర్వహించేందుకు న్యూస్‌క్లిక్ సైట్‌కు నిధులు వచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఉగ్రవాద చట్టం యూఏపీఏ కింద ఆ సైట్‌పై కేసు బుక్ చేశారు. చైనా సంస్థల నుంచి సుమారు 80 కోట్లను న్యూస్‌క్లిక్ పోర్టల్ వసూల్ చేసినట్లు తెలుస్తోంది.

## రూ. 75 వేల విలువ చేసే హ్యాష్ ఆయిల్ సీజ్..
## నిందితుడు అరెస్ట్

**మేడ్చల్ మల్కాజ్‌గిరి :** దుండిగల్ పోలీసు స్టేషన్ పరిధిలో హ్యాష్ ఆయిల్ విక్రయిస్తున్న ఓ యువకుడిని బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ యువకుడి వద్ద రూ. 75,200 విలువ చేసే 94 గ్రాముల హ్యాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆయిల్‌ను హిమాచల్‌ప్రదేశ్ నుంచి తీసుకొచ్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఒక్కో గ్రామును రూ. 8 వేలకు కాలేజీ విద్యార్థులకు విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.నిందితుడు కనగల ఉదయ్ కుమార్(29) వృత్తి రీత్యా డాగ్ బ్రీడర్ అని తేలింది. దుండిగల్ పరిధిలోని మల్లంపేట్ ఎస్సార్కే హోమ్స్‌లోని విల్లా నెంబర్ 12లో నివాసముంటున్నట్లు పేర్కొన్నారు. ఉదయ్ నుంచి డిజిటల్ వెయిటింగ్ మెషీన్, రూ. 11 వేల నగదు, మొబైల్ ఫోన్‌ను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.



## బీఎస్పీ ఎమ్మెల్యే హత్య కేసులో ఆరుగురికి
## జీవితకాల జైలుశిక్ష



**న్యూఢిల్లీ:** బీఎస్పీ ఎమ్మెల్యే రాజు పాల్ 2005లో హత్యకు గురయ్యాడు. ఆ కేసులో శుక్రవారం ప్రత్యేక సీబీఐ కోర్టు తీరును వెలువరించింది. ఆ కేసులో ఏడుమందిని దోషులుగా ప్రకటించింది. అయితే ఆరుగురికి జీవిత ఖైదు శిక ను విధించారు. గత ఏడాది మర్డర్‌కు గురైన గ్యాంగ్‌స్టర్ అతిక్ అహ్మద్ కూడా ఈ కేసులో ప్రధాన నిందితుడు. ప్రత్యేక సీబీఐ జడ్జి కవితా మిశ్రా తీర్పును ఇచ్చారు. రంజీత్ పాల్, అబిద్, ఫర్హాన్ అహ్మద్, ఇస్రార్ అహ్మద్, జావెద్, గుల్‌హసన్, అబ్దుల్ కావి ఈ కేసులో నిందితులు. ఇస్రార్ అహ్మద్‌కు జీవిత కాల శిక్షను విధించలేదు. ఆరుగురికి జీవిత కాల శిక్షతో పాటు 11.65 లక్షల జరిమానా కూడా విధించారు. ప్రయాగ్‌రాజ్ ఎమ్మెల్యే రాజూ పాల్‌తో పాటు అతని అనుచరులు దేవి దిన్ పాల్, సందీప్ యాదవ్‌లను 2005, జనవరి 25వ తేదీన హత్య చేశారు. 2004 ఉప ఎన్నికల్లో అతిక్ అహ్మద్ సోదరుడు అష్రఫ్‌ను ప్రయాగ్‌రాజ్ వెస్ట్ సీటులో రాజ్ పాల్ ఓడించారు. ఆ కక్షతో బీఎస్పీ ఎమ్మెల్యేపై అప్పట్లో అటాక్ జరిగింది. అష్రఫ్ అహ్మద్‌కు చెందిన 9 మంది గ్యాంగ్.. పాల్ వాహనాన్ని అడ్డుకుని తుపాకులతో కాల్చి చంపారు.

## పీవీ నరసింహారావుకు భారతరత్న..
## అవార్డు అందుకున్న కుమారుడు ప్రభాకర్ రావు



**న్యూఢిల్లీ :** ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో భారతరత్న అవార్డుల ప్రదాన కార్యక్రమం ఘనంగా జరి గింది. పీవీ నరసింహారావు తరపున ఆయన కుమారుడు ప్రభాకర్ రావు.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. చౌదరి చరణ్ సింగ్, కర్పూరీ ఠాకూర్, స్వామినాథన్ కుటుంబ సభ్యులు కూడా భారతరత్న అవార్డు అందుకున్నారు. చరణ్‌సింగ్ తరపున ఆయన మనువడు జయంత్ సింగ్, స్వామినాథన్ తరపున ఆయన కుమార్తె నిత్యా రావు, కర్పూరీ ఠాకూర్ తరపున ఆయన కుమారుడు రామ్‌నాథ్ ఠాకూర్ భారతరత్న అందుకున్నారు. రేపు రాష్ట్రపతి, ప్రధాని మోదీ ఎల్‌కే అద్వానీ ఇంటికి వెళ్లి భారతరత్న అవార్డు ప్రదానం చేయనున్నారు.

# కూలిన నిర్మాణంలో ఉన్న వంతెన.. యూపీలో ఘటన



**లక్నో:** నిర్మాణంలో ఉన్న వంతెనలో కొంత భాగం కూలిపోయింది. వంతెనపై నిర్మిస్తున్న రెండు బీములు కూలిపోయాయి. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదు. ఉత్తరప్రదేశ్‌లోని బులందషహర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. గజ్రౌలా గ్రామం నుంచి అమ్రో హాలోని విరంపూర్ గ్రామం వరకు రూ.83 కోట్ల వ్యయంతో గంగా నదిపై బ్రిడ్జి నిర్మిస్తున్నారు. పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ), సేతు నిగమ్ పర్యవేక్షణలో వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి.
కాగా, శుక్రవారం అర్ధరాత్రి వేళ వంతెనకు చెందిన రెండు బీములు కూలిపోయాయి. అయితే భారీ గాలితో కూడిన వర్షం వల్ల ఈ సంఘటన జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదని, ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదని చెప్పారు.
మరోవైపు నాణ్యత లేని నిర్మాణ సామగ్రిని వినియోగించడం వల్ల ఈ వంతెనకు చెందిన రెండు బీములు కూలినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అధికారులు వీటిని ఖండించారు.

### వారాంతపు సెలవుల కారణంగా
# తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ



**అమరావతి :** ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో వారాంతపు సెలవుల కారణంగా తిరుమల భక్తుల రద్దీ పెరిగింది. శుక్రవారం గుడ్‌ఫ్రైడేతో పాటు శనివారం మినహా ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కొండపై ఉన్న కంపార్టుమెంట్లన్ని నిండిపోయాయి. సేవాసదన్ వరకు భక్తులు క్యూలైన్లో నిలబడ్డారు.టోకెన్లు లేని భక్తులకు 24 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని టీటీడీ అధికారులు వివరించారు . నిన్న స్వామివారిని 60,958 మంది భక్తులు దర్శించుకోగా 31, 245 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా రూ. 3.41 కోట్లు వచ్చిందని తెలిపారు.

# ఒడిశాలో అధికార బీజేడీకి షాక్..
### రాజీనామా చేసిన సిట్టింగ్ ఎంపీ



**ఒడిశా:** ఒడిశా రాష్ట్రంలో అధికార బీజేడీకి గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన సిట్టింగ్ ఎంపీ, సీనియర్ నేత అనుభవ్ మొహంతి బీజేడీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను ఒడిశా ముఖ్యమంత్రి, బీజేడీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్‌కు పంపించారు.ఇన్నేళ్లుగా తనకు ప్రజాసేవ చేసుకునే అవకాశం కల్పించినందుకు నవీన్ పట్నాయక్‌కు, బీజేడీకి మొహంతి కృతజ్ఞతలు తెలిపారు. వ్యక్తిగత కారణాలతోనే పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. తనకు అత్యంత సన్నిహితంగా ఉండే వ్యక్తులు ఇటీవల మరణించడంతో సరిగా పనిచేయలేకపోతున్నానని తెలిపారు.అందుకే రాజీనామా నిర్ణయం తీసుకున్నానని వివరించారు. రాజకీయాలకు దూరంగా ఉంటానని పేర్కొన్నారు. తాను రాజకీయాలకు దూరంగా ఉన్నా, నా నియోజకవర్గ ప్రజలకు ఎప్పటికీ సేవ చేసుకుంటానని తెలిపారు. ప్రస్తుతం అనుభవ్ మొహంతి కేంద్రపార నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

# నల్లమద్ది చెట్టు నుంచి ఉప్పొంగిన నీళ్లు.. వీడియో



**హైదరాబాద్ :** జలధార ధరణి నుంచే కాదు.. చెట్ల నుంచి కూడా ఉప్పొంగుతోంది. చెట్ల నుంచి నీళ్లు ఉప్పొంగడం ఏంటని మీకు అనుమానం రావొచ్చు. కానీ ఇది నిజం. అభయారణ్యాల్లో ఉండే నల్లమద్ది చెట్టు నుంచి జలధార ఉప్పొంగింది. చెట్టు నుంచి ఉబికి వచ్చిన నీళ్లను చూసి అటవీశాఖ అధికారులు ఆశ్చర్యపోయారు.వివరాల్లోకి వెళ్తే.. పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని పాపికొండల్లోని కింటుకూరు అటవీ ప్రాంతంలో ఓ నల్లమద్ది చెట్టు నుంచి జలధార ఉప్పొంగుతున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు చేరవేశారు. దీంతో ఉన్నతాధికారుల సమక్షంలో నల్లమద్ది చెట్టుకు గొడ్డలితో రంధ్రం చేయగా, నీళ్లు ఉబికివచ్చాయి. ఈ దృశ్యాన్ని అధికారులు తమ కెమెరాల్లో బంధించారు. ఇక ఈ నల్లమద్ది వృక్షం నుంచి సుమారు 20 లీటర్ల వరకు నీళ్లు వస్తాయని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.

# ప్రశాంతంగా ముగిసిన ముఖ్తార్ అన్సారీ అంత్యక్రియలు

**హైదరాబాద్ :**గ్యాంగ్‌స్టర్ నుంచి పొలిటీషియన్‌గా మారి, ఏకంగా ఐదు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసి, గురువారం రాత్రి గుండెపోటుతో మరణించిన ముఖ్తార్ అన్సారీ అంత్యక్రియలు ప్రశాంతంగా ముగి శాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఘాజీపూర్ జిల్లా మొహమ్మదాబాద్ పట్టణంలోని కాళీబాగ్ శ్మశాన వాటికలో ఆయన సోదరుడు అఫ్జల్ అన్సారీ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు.

# కేకే, కడియం.. ఊసరవెల్లి, పాము లాంటోళ్లు..
# ఎర్రోళ్ల శ్రీనివాస్ తీవ్ర విమర్శలు

**హైదరాబాద్ :** కే కేశవరావు, కడియం శ్రీహరి.. ఊసరవెల్లి, పాము లాంటోళ్లు అని బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్ తీవ్ర విమర్శలు చేశారు. ఊసరవెల్లి ప్రమాదంలో ఉన్నప్పుడు మాత్రమే రంగులు మారుస్తదట. పాము గడ్డు సమయంలోనే తనను ఎవరైనా కొట్టి చంపుతారని అనుకున్నప్పుడు అది పడగ విప్పి కాటేస్తదట. కేకే, కడియం ఈ రెండింటి కంటే ప్రమాదకరం అని ఎర్రోళ్ల శ్రీనివాస్ ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో ఎర్రోళ్ల శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు.కుర వృద్ధులైన కేకే, కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీలో అనేక పదవులు అనుభవించి, అవకాశాలు పొంది ఇవాళ పార్టీ మారుతుంటే సిగ్గు అనిపిస్తుంది. ఎందుకంటే రాజకీయాల్లో వెంటిలేటర్ మీద ఉన్న వీళ్లకు కేసీఆర్ ఆక్సిజన్ ఇచ్చి బతికించుండు. కాంగ్రెస్, టీడీపీలో ఉన్న ఈ లీడర్లకు ఏముండే. కడియం శ్రీహరిని 2014లో వరంగల్ ఎంపీని చేశాం. 2016లో ఎమ్మెల్సీని చేసి డిప్యూటీ సీఎం ఇచ్చాం. అదే విధంగా 2021లో ఎమ్మెల్సీ రెన్యువల్ చేశాం. 2023లో ఎమ్మెల్యేను చేశాం. అది కూడా ఎమ్మెల్సీ పదవి కాలం నాలుగేండ్లు ఉన్నప్పటికీ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చి గెలిపించారు



కేసీఆర్. సిట్టింగ్ ఎమ్మెల్యేను వదిలేసి కడియం శ్రీహరికి కేసీఆర్ అవకాశం ఇచ్చారు. నా బిడ్డకు(కడియం కావ్య) టికెట్ కావాలంటే వరంగల్ ఎంపీ టికెట్ ప్రకటించారు కేసీఆర్. ఇవాళ గమ్మత్తు ఏంటంటే.. రాజకీయాలకు విలువలు ఉన్నాయా..? అనిపిస్తుంది. మార్చి 27న కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు కడియం కావ్య. 28న సాయంత్రం పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఉత్తరం రాశారు అని ఎర్రోళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు.కడియం కావ్యకు ఎంపీ టికెట్ ఇవ్వడంతో ఆ ముగ్గురిని కోల్పోయాం..కడియం శ్రీహరి తన 50 ఏండ్ల రాజకీయ సీనియారిటిని ఈ చిల్లర రాజకీయం కోసం వాడుకున్నారని అనిపిస్తుంది. కడియం కావ్యకు ఎంపీ టికెట్ ఇవ్వడంతో.. రాజయ్య, ఆరూరి రమేశ్, పసునూరి దయాకర్ పార్టీకి దూరమయ్యారు. కడియం వల్ల ముగ్గురి వ్యక్తులను కోల్పోయాం. అయినా ఇవాళ పార్టీని డ్యామేజ్ చేశారు. కేసీఆర్‌ను పూర్తిగా మోసం చేశారు. ఇది విలువల్లేని రాజకీయం. ఒక పక్కా ప్రణాళిక ప్రకారం కడియం పార్టీ మారారు. ఇది బ్లాక్ మెయిల్ రాజకీయం. వీళ్లను పవర్ బ్రోకర్లు అనాలా..? రియల్ బ్రోకర్లు అనాలా..? అర్థం కావడం లేదు. తెలంగాణ ఉద్యమం నుంచి ఎదిగి వచ్చిన నాయకులం మేం. తెలంగాణ కోసం వ్యక్తిగత జీవితాలను త్యాగం చేసి, ప్రజా సేవ కోసం పాటుపడాలని కేసీఆర్ నాయకత్వంలో పని చేస్తు న్నాం. మీలాంటి వాళ్ల కోసం ఎన్నో త్యాగాలు చేశాం. మేం త్యా గాలు చేసి మీకు పదవులు అప్పజెప్తే.. మీరేమో భోగాలు అను భవించి ఇప్పుడు పార్టీని తిడుతున్నారు. ఇది సరికాదు. ఇవాళ మీ వల్ల వరంగల్ జిల్లాలో ఎంతో నష్టం జరిగిందని ఎర్రోళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు.

# ఎవరు ఎటు వెళ్లిన బీఆర్ఎస్‌కి నష్టం లేదు
### : మాజీ స్పీకర్ పోచారం

**హైదరాబాద్ :** ఎవరు వెళ్లిన బీఆర్ఎస్ నష్టం లేదని.. పార్టీలో ప్రస్తుతం గట్టి కార్యకర్తలు మాత్రమే మిగిలారని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ మంజుశ్రీ రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. జహీరాబాద్ పార్లమెంట్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీ మాయమాటలు నమ్మి ప్రజలు భ్రమతో ఓట్లు వేశారన్నారు. హామీల కోసం ప్రభుత్వ ఖజానా నుంచి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు ఇబ్బందులుపడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను, చేస్తున్న మోసాలను ప్రజల్లో ప్రచారం చేయాలన్నారు. బీజేపీ పదేళ్ల పాలనలో ప్రజల కోసం ఒక్క పని చేయలేదని.. దేశానికి బీజేపీ చేసింది శూన్యమన్నారు. కులాలు, మతాలను అడ్డం పెట్టుకొని బీజేపీ రాజకీయం చేస్తుందని ఆరోపించారు.ఈడీ, సీబీఐ, ఐటీలను ఉపయోగించి ప్రతిపక్షాలను వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఎంపీలు ఉండి జహీరాబాద్ ప్రాంతానికి చేసింది ఏమీ లేదన్నారు. ఎంపీగా ఉండి స్వార్థం కోసమే.. వ్యాపారాలు చేసుకోవడానికి తప్ప ప్రజల కోసం చేసిందేమీ లేదన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ కుట్రపూరిత రాజకీయాలు




చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యకర్తలు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో పోరాడి గెలిపించాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ వేదికగా జహీరాబాద్ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. జహీరాబాద్ ప్రాంత ప్రజాల గొంతుకనై పోరాడుతానన్నారు.

# కొప్పుల ఈశ్వర్ 36 గంటల రైతుభరోసా దీక్ష ప్రారంభం

**పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లాలో అన్నదాతకు అండగా బీఆర్ఎస్ నిలబడింది. పంటలు ఎండుతున్నా పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరికి నిరసనగా మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ 36 గంటల రైతు భరోసా దీక్ష చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ భవన్‌లో దీక్ష ప్రారంభించారు. ఆదివారం సాయంత్రం 8 గంటల వరకు కొనసాగనుంది. ఇందులో పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. మూడు నెలల కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టకాలం దాపురించిందన్నారు. లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. నష్టపోయిన పంటలకు వెంటనే రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకునేంత వరకు వెనక్కి తగ్గేదిలేదని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం రాకముందు ఉన్న పరిస్థితుల్లే మళ్లీ వచ్చాయని చెప్పారు. కేసీఆర్ రైతుల పక్షపాతిగా పనిచేశారని, రాష్ట్రంలో రైతులను అభివృద్ధి వైపు నడిపిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు.కేసీఆర్ పదేళ్ల పాలనలో వ్యవసాయం పండుగలా మారింది. పుష్కలమైన నీళ్లు, 24గంటల ఉచిత కరెంట్, రైతుబంధు, రైతుబీమా పథకాలతో సంబురంగా సాగింది. కానీ, కాంగ్రెస్ సర్కారు వంద రోజుల పాలనలో సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా ఎక్కడ చూసినా సాగునీటి గోస తీవ్రమవుతున్నది. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా దాదాపు 10 వేలకు పైగా ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. చేతికి వచ్చే దశలో దెబ్బతిన్నాయి. మున్ముందు పరిస్థితులు మరింత దారుణంగా ఉండనున్నాయి. అయినా ఇప్పటి వరకు ప్రభుత్వం స్పందించలేదు. స్థానికంగా ఉండే పాలకులు కూడా కనీసం కన్నెత్తి చూడలేదు.ఇటు యంత్రాంగం కూడా క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదు. తెలంగాణ తొలి సీఎం



కేసీఆర్ మొన్నటి వరకు రైతులకు ఏ కష్టం రాకుండా చూసుకోగా.. ఇప్పుడు రైతులు పడుతున్న కష్టాన్ని చూసి బీఆర్ఎస్ నాయకులు చలించిపోతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ భరోసానిస్తున్నారు. ఇటీవల మంథని, ముత్తారం, కాల్వశ్రీరాంపూర్, ఓదెల, సుల్తానాబాద్, ధర్మారం, ఎలిగేడు, జూలపల్లి, పెద్దపల్లి మండలాల్లో దెబ్బతిన్న పొలాలను పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం పరిశీలించారు. రైతులకు మేమున్నామని ధైర్యం చెప్పారు.

# ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మరో మంత్రికి ఈడీ నోటీసులు ఢిల్లీ మద్యం పాలసీ కేసులో

**న్యూఢిల్లీ:** ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఆప్ మరో మంత్రికి ఈడీ తాఖీదులిచ్చింది. సీఎం కేజ్రీవాల్ కేబినెట్‌లో హోం, రవాణా, న్యాయశాఖ మంత్రిగా కైలాశ్ గెహ్లాట్‌కు నోటీసులు పంపింది. శనివారమే విచారణకు రావాలని అందులో స్పష్టం చేసింది. ఇదే కేసులో కేజ్రీవాల్‌ను ఈ నెల 21న ఈడీ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.గెహ్లాట్ ప్రస్తుతం నజఫ్‌గంజ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. 2021-22 ఢిల్లీ మద్యం పాలసీ డ్రాఫ్ట్‌ను రూపొందించిన ప్యానల్‌లో ఆయన సభ్యుడిగా ఉన్నాడు. తన అధికార నివాసాన్ని ఆప్ కమ్యూనికేషన్ ఇన్‌చార్జ్ విజయ్ నాయర్ వాడుకోవడానికి అనుమతించాడని, అదేవిధంగా గెహ్లాట్ తరచూ ఫోన్ నంబర్లు మార్చాడని ఈడీ ఆరోపిస్తున్నది. కాగా, ఇదే కేసులో కేజ్రీవాల్ ప్రస్తుతం ఈడీ కస్టడీలో ఉన్న విషయం తెలిసిందే.

# పెరిగిన ప్యానెల్ ధరలు.. స్మార్ట్ టీవీలు మరింత ప్రియం

**న్యూఢిల్లీ :** స్మార్ట్ టీవీల ధరలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో ప్యానెల్ ధరలు పెరగడంతో ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో టీవీల ధరలు పెరిగే అవకాశం ఉన్నదని కౌంటర్‌పాయింట్స్ ఐవోటీ సర్వీస్ వెల్లడించింది. అయినప్పటికీ దేశీయంగా ప్రీమియం మాడళ్లకు డిమాండ్ అధికంగా ఉండటంతో స్మార్ట్ టీవీ దిగుమతులు 9 శాతం మేర పెరిగే అవకాశం ఉన్నదని పేర్కొంది. కస్టమర్ల అభిరుచులు మారుతున్నాయని, ముఖ్యంగా అతిపెద్ద స్క్రీన్ టీవీలకు అప్‌గ్రేడ్ అవుతుండటం ఇందుకు కారణమని పేర్కొంది.


ఆఫ్‌లైన్‌తో పోలిస్తే ఆన్‌లైన్‌లో టీవీల విక్రయాలు దూసుకుపోతున్నాయి. ప్రీమియం మాడళ్లను సైతం ఆన్‌లైన్‌లో చూసి కొనుగోలు చేస్తున్నారు.కొనుగోలుదారులు ఆఫ్‌లైన్ కంటే ఆన్‌లైన్‌పై నమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రీమియం టీవీలకు పెరుగుతున్న డిమాండ్‌తో సరాసరి వీటి విక్రయ ధర కూడా అధికం కాబోతున్నది. దేశ ఆర్థిక పరిస్థితులు నిరాశాజనకంగా ఉండటంతో గతేడాది టీవీల దిగుమతులు 16 శాతం మేర తగ్గిన విషయం తెలిసిందే. దేశీయంగా వినియోగిస్తున్న టీవీల్లో స్మార్ట్ టీవీల వాటా 93 శాతంగా ఉన్నది. ఈ ఏడాది మరింత పెరిగే అవకాశం కూడా ఉన్నదని తన నివేదికలో వెల్లడించింది. 43 అంగుళాల కలిగిన క్యూలెడ్ టీవీలను విక్రయిస్తున్న టీసీఎల్, ఏసర్, కొడక్, థామ్సన్, ఇతర బ్రాండ్లకు కస్టమర్ల నుంచి విశేష స్పందన లభిస్తున్నది.



# ఏఐలో టీసీఎస్ దూకుడు..

## 3.5 లక్షల ఉద్యోగులకు శిక్షణ

**ముంబై :** కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రాధాన్యత అన్ని రంగాల్లోనూ అంతకంతకూ పెరుగుతున్న నేపథ్యంలో దేశీయ ఐటీ సంస్థలూ ఆ దిశగా అడుగులు వేస్తున్నాయి. ఈ క్రమంలోనే భారతీయ ఐటీ రంగ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్).. జనరేటివ్ ఏఐ స్కిల్స్‌లో 3.5 లక్షల మందికిపైగా ఉద్యోగులకు శిక్షణ ఇచ్చినట్టు శుక్రవారం తెలిపింది. ఈ ఏడాది జనవరిలో 1.5 లక్షల ఉద్యోగులకు శిక్షణ ఇచ్చినట్టు ప్రకటించిన టీసీఎస్.. తాజాగా ఆ సంఖ్య 3.5 లక్షలను దాటేసిందని స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో ఏఐ పరిజ్ఞానం ఉన్న ఉద్యోగులను కలిగిన సంస్థల్లో ఒకటిగా టీసీఎస్ ఎదుగుతోందని ఈ సందర్భంగా విడుదల చేసిన ఓ ప్రకటనలో టీసీఎస్ పేర్కొన్నది. నిజానికి గత ఏడాదే ఏఐ కోసం ఓ బిజినెస్ యూనిట్‌ను ఏర్పాటు చేసి, ఆ ఘనతను సాధించిన తొలి టెక్నాలజీ కంపెనీగా టీసీఎస్ నిలిచింది.ఫ్రెషర్ల నియామకాలు షురూటీసీఎస్ ఫ్రెషర్ల నియామకాలను మొదలు పెట్టింది. మూడు విభాగాల్లో కొత్తవారిని ఉద్యోగాల్లోకి సంస్థ తీసుకుంటున్నది. నింజా, డిజిటల్, ప్రైమ్ కేటగిరీల్లో హైరింగ్‌కు టీసీఎస్ దిగుతున్నది. నిజానికి కరోనా, మార్కెట్‌లో డిమాండ్ లేని కారణంగా ఐటీ సంస్థలు నియామకాల ప్రక్రియను దాదాపుగా పక్కకు పెట్టేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో టీసీఎస్.. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లకు కొత్త ఉత్సహాన్నిచ్చేలా చేస్తుండటం విశేషం. కాగా, ఏప్రిల్ 10 దరఖాస్తులకు ఆఖరు తేదీ. ఏప్రిల్ 26న పరీక్షలుంటాయి. ఈ ఏడాది బీటెక్, బీఈ, ఎంసీఏ, ఎంఎస్సీ, ఎంఎస్ బ్యాచ్ విద్యార్థుల నుంచి కంపెనీ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది. ఇదిలావుంటే నింజా కేటగిరీలో వివిధ హోదాలకుగాను వార్షిక వేతన ప్యాకేజీ రూ.3.36 లక్షలు. అయితే డిజిటల్, ప్రైమ్ కేటగిరీల్లో




జీతాలు రూ.7 లక్షలు, రూ.9-11.5 లక్షలుగా ఉండటం గమనార్హం. అయితే ఈ దఫా ఎన్ని ఖాళీలను టీసీఎస్ భర్తీ చేస్తుందన్నది మాత్రం తెలియరాలేదు.

# మెరిసిన బీఎస్ఈ మిడ్, స్మాల్‌క్యాప్..

## ఈ ఆర్థిక సంవత్సరం చిన్న షేర్లదే హవా

**న్యూఢిల్లీ :** బడా షేర్ల కంటే చోటా షేర్లు ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) మదుపరులకు ఎక్కువ లాభాలను తెచ్చిపెట్టాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ షేర్లు దాదాపు 62 శాతం వృద్ధిని ప్రదర్శించాయని తేలింది. ప్రధానంగా ఆయా కార్పొరేట్ సంస్థల త్రైమాసిక ఆర్థిక ఫలితాలు బాగుండటంతోనే ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున పెట్టుబడులకు ముందుకొచ్చారని ఈ ట్రెండ్‌ను నిపుణులు విశ్లేషిస్తున్నారు. స్మాల్‌క్యాప్ స్టాక్స్‌పై రిటైల్ ఇన్వెస్టర్లు ఆసక్తి కనబర్చి ఆకర్షణీయ స్థాయిలోనే లాభాలను అందుకోగలిగారని అంటున్నారు. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌ల్లోనూ నికర పెట్టుబడుల రాక లార్జ్‌క్యాప్ కంటే మిడ్, స్మాల్‌క్యాప్ షేర్లలోనే ఎక్కువగా ఉన్నట్టు గుర్తుచేస్తున్నారు.కొత్త ఏడాదిలోనూ..వచ్చే కొత్త ఆర్థిక సంవత్సరం (2024-25)లోనూ స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు జోరు ను ప్రదర్శిస్తాయని స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ లిమిటెడ్ ఎండీ సునీల్ న్యాతీ అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలోనే కేంద్రంలో మరో సారి ఈ ప్రభుత్వమే అధికారంలోకి వస్తే మార్కెట్లు మరింత



దూకుడు మీదుండగలవన్నారు. కాగా, వడ్డీరేట్ల పెరుగుదల, అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితులు, లాభాల స్వీకరణ అంశాలు.. మార్కెట్లను ఒడుదొడుకులకు లోను చేయవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.రూ.3.4 లక్షల కోట్లు రాక విదేశీ మదుపరులు భారతీయ మార్కెట్లపై ఈ ఆర్థిక సంవత్సరం అమితాసక్తినే కనబర్చారు. దేశీయ క్యాపిటల్ మార్కెట్లలోకి విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐ) తెచ్చిన పెట్టుబడులు దాదాపు రూ.3.4 లక్షల కోట్లుగా ఉన్నాయి మరి. ఈ 2023-24లో స్టాక్ మార్కెట్లలోకి సుమారు రూ.2.08 లక్షల కోట్ల పెట్టుబడుల్ని తీసుకొచ్చిన ఎఫ్‌పీఐలు.. రుణ మార్కెట్లలోకి మరో రూ.1.3 లక్షల కోట్ల పెట్టుబడుల్ని పట్టుకొచ్చారు. నిజానికి అంతకుముందు రెండు ఆర్థిక సంవత్సరాల్లోనూ పెట్టుబడుల ఉపసంహరణకే మదుపరులు పెద్దపీట వేశారు. అంతర్జాతీయంగా కేంద్ర బ్యాంకులన్నీ వడ్డీరేట్లను భారీ ఎత్తున పెంచడంతో దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి 2021-22లో రూ.1.4 లక్షల కోట్లు, 2022-23లో రూ.37,632 కోట్లు తరలిపోయాయి. అయితే 2020-21లో మాత్రం రికార్డు స్థాయిలో రూ.2.74 లక్షల కోట్ల పెట్టుబడులను తెచ్చారు. మళ్లీ ఆ తర్వాత ఈ ఆర్థిక సంవత్సరంలోనే పెట్టుబడులకు ఎఫ్‌పీఐలు ముందుకొచ్చారు. ఇక గత ఆర్థిక సంవత్సరం (2022-23) భారతీయ రుణ మార్కెట్ల నుంచి రూ.8,938 తీసుకున్నారు.

## 55 లక్షల కోట్ల నుంచి 205 లక్షల

# కోట్లకు అప్పును పెంచేశారు

## : ప్రియాంకా గాంధీ

**న్యూఢిల్లీ:** బీజేపీ నేతృత్వంలోని కేంద్ర సర్కారు 14 లక్షల కోట్ల రుణం తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తోందని, ఆ ప్రతిపాదనలను కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వద్రా తప్పుపట్టారు. దేశ ప్రజలను ఎందుకు అప్పుల ఊబిలోకి నెట్టివేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభం పెరుగుతున్నట్లు ఆమె చెప్పారు. ఆర్థిక లోటును పూడ్చేందుకు సెక్యూర్టీలను జారీ చేసి రాబోయే ఆర్థిక సంవ త్సరానికి సుమారు 14.13 లక్షల కోట్ల రుణం తీసుకోనున్నట్లు ఇటీవల బడ్జెట్ ప్రసంగంలో మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొ న్నారు. ఆ విషయాన్ని ప్రియాంకా గాంధీ తన ఎక్స్ అకౌంట్‌లో ప్రశ్నించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 14 లక్షల కోట్లు అప్పు తీసుకోవాలని ఆర్థిక శాఖ ప్రతిపాదించిందని, ఎందు కోసం ఆ డబ్బు అని ప్రియాంకా ప్రశ్నించారు.

## ట్రాక్టర్ల బిజినెస్‌కు ఫోర్స్ గుడ్‌బై



**న్యూఢిల్లీ :** ట్రాక్టర్ల వ్యాపారం నుంచి వైదొలుగుతున్నట్లు ఫోర్స్ మోటర్ ప్రకటించింది. కంపెనీ బోర్డు డైరెక్టర్లు శుక్రవారం సమావేశమై ఈ నిర్ణయం తీసు కున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచే వ్యవసాయ ట్రాక్టర్లు, కనెక్టెడ్ యాక్టివిటీ వ్యా పారాల నుంచి వైదొలిగే విషయాన్ని కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. మొబిలిటీ ట్రాన్స్‌పోర్టేషన్, లాస్ట్-మైల్ మొబిలిటీ, సరుకు రవాణా, ప్రీమియం లగ్జరీ ఓఈఎం విడిభాగాలపై ప్రత్యేక దృష్టి సారించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ ఆర్థిక సంవత్సరానికిగాను కంపెనీకి వ్యవసాయ ట్రాక్టర్లను విక్రయించడంతో రూ.182.53 కోట్ల ఆదాయం సమకూరింది.

## తగ్గనున్న బ్యాంకుల ఎన్‌పీఏలు




**ముంబై :** బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తుల విలువ మరింత తగ్గే అవకాశాలున్నాయని కేర్ రేటింగ్ ఏజెన్సీ వెల్లడించింది. 2024-25లో దేశీయ బ్యాంకుల స్థూల నిరర్థఖ ఆస్తుల విలువ 2.1 శాతానికి దిగిరావచ్చునని పేర్కొంది. 2023-24లో 2.5-2.7 శాతానికి తగ్గనున్న ఎన్‌పీఏలు..ఆ తర్వాతి ఏడాదిలో 2.1-2.4 శాతానికి పరిమితం కానున్నదని సంస్థ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. 2013-1లలో 3.8 శాతంగా ఉన్న బ్యాంకుల మొండి బకాయిలు 2017-18 నాటికి 11.2 శాతానికి పెరిగాయి.

దీంతో బ్యాంకుల మొండి బకాయిలపై రిజర్వుబ్యాంక్, కేంద్ర ప్రభుత్వాలు ఆందోళన వ్యక్తం చేయడంతో వీటిని తగ్గించుకోవడానికి పలు చర్యలు తీసుకోవాలని సూచించాయి. గడిచిన ఆర్థిక సంవత్సరంలో పలు బ్యాంకుల ఎన్‌పీఏలు పదేండ్ల కనిష్ఠ స్థాయి 3.9 శాతానికి తగ్గిన విషయం తెలిసిందే. బ్యాంకుల ఆస్తుల నాణ్యత ప్రమాణాలు పెరగడం, మొండి బకాయిలను వసూళ్ల కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం కలిసొచ్చింది. రంగాలవారీగా చూస్తే వ్యవసాయ రంగంలో మొండి బకాయిలు 7 శాతానికి తగ్గగా, ఇండస్ట్రీయల్స్ రంగంలో 14.1 శాతం నుంచి 4.2 శాతానికి దిగొచ్చాయి.

## బీజేపీ వయనాడ్ అభ్యర్థిపై 242 కేసులు.. శబరిమల నిరసనలకు సంబంధించి 237 కేసులు



**తిరువనంతపురం:** కేరళ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, ఆ పార్టీ వయనాడ్ అభ్యర్థి కే సురేంద్రన్‌పై 242 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఇందులో 237 కేసులు శబరిమల నిరసనలకు సంబంధించినవే కావడం విశేషం. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై వయనాడ్ నుంచి పోటీ చేస్తున్న ఆ రాష్ట్ర బీజేపీ చీఫ్‌పై నమోదైన కేసుల వివరాలను ఆ పార్టీకి చెందిన వార్తా పత్రిక ద్వారా వెల్లడించారు. 242 కేసులకు సంబంధించిన వివరాలను మూడు పేజీల్లో ప్రచురించారు. అలాగే ఎర్నాకులం నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి కెఎస్ రాధాకృష్ణన్‌పై కూడా 211 కేసులున్నట్లు అందులో పేర్కొన్నారు.కాగా, కేరళ బీజేపీ అభ్యర్థులైన సురేంద్రన్, రాధాకృష్ణన్, అలప్పుజా అభ్యర్థి శోభా సురేంద్రన్, వటకర అభ్యర్థి ప్రఫుల్ కృష్ణపై నమోదైన కేసుల వివరాలను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ శుక్రవారం ట్వీట్ చేశారు. 'భారత్‌లోని కొన్ని ప్రాంతాల్లో జాతీయవాదిగా ఉండటం చాలా కష్టం. ఇది రోజువారీ పోరాటం. కానీ విలువైన పోరాటం. వయనాడ్ బీజేపీ అభ్యర్థి సురేంద్రన్ ఫారం సీ7. ఒక వ్యక్తి%ా% వందల కేసులు' అని అందులో పేర్కొన్నారు.

### బీజేపీ గేట్లు తెరిస్తే కాంగ్రెస్ సర్కారు 48గంటలుండదు

## : మహేశ్వర్‌రెడ్డి

**ముంబై :**భారతీయ జనతా పార్టీ గేట్లు తెరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం 48గంటలు కూడా ఉండదంటూ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మహేశ్వర్‌రెడ్డి శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తమతో ఎనిమిది మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఆయన స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బీజేపీ ఎమ్మెల్యేలను టచ్ చేస్తే కాంగ్రెస్ సర్కారు కూలడం తథ్యమన్నారు.సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న వసూళ్ల చిట్టా తమవద్ద ఉందని.. హైదరాబాద్ డబ్బులు దేశ రాజకీయాల కోసం కాంగ్రెస్ వినియోగిస్తోందని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి గతంలో రంజిత్ రెడ్డిపై చేసిన ఆరోపణలు ఏమయ్యాయని ప్రశ్నించారు.



అప్పుడు రంజిత్ రెడ్డి అవినీతి చేశారని చెప్పిన రేవంత్.. ఇప్పుడు ఆయనకే ఎన్నికల్లో ఓటు వేయాలని ఎలా అడు గుతారని నిలదీశారు. రాష్ట్రంలో బీజేపీ ఎమ్మెల్యేలను టచ్ చేసి చూడండి ఏం జరు గుతు ందో మీకే తెలుస్తుంది అంటూ హెచ్చరికలు జారీ చేశారు. తమ పార్టీ గేట్లు ఎత్తితే 48గం టల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండదన్నారు. నితిన్ గడ్కరీ వద్దకు వెళ్లి షిండే పాత్ర పోషి స్తానని కోమటిరెడ్డి అన్నది వాస్తవమని.. అయితే, కోమటిరెడ్డిపై ఎవరికీ నమ్మకం లేదన్నారు.

## జోధ్‌పూర్ లోక్‌సభ స్థానంలో నామినేషన్ దాఖలు చేసిన కేంద్రమంత్రి



**న్యూఢిల్లీ :**లోక్‌సభ తొలి విడత ఎన్నికల నామినేషన్‌ల గడువు ముగియ గానే ఈ నెల 28న రెండో విడత నామినేషన్‌ల ప్రక్రి య మొదలైంది. మొ త్తం 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో రెండో విడత లోక్‌సభ ఎన్నికలు జరగ నున్నాయి. ఈ క్రమంలో రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ లోక్‌సభ స్థానంలో కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ నామినేషన్ వేశారు.

# పరాగ్ 2.0.. రియాన్ ఇప్పుడు మారిన మనిషి..!



"ఎన్‌సీఏలో కొద్దివారాల క్రితమే ఓ వ్యక్తిని కలిశాను. అతడు చిన్న గాయం నుంచి కోలుకోవడానికి ఇక్కడికి వచ్చాడు. ఆ కుర్రాడు పూర్తిగా తన రికవరీ మీదే దృష్టి సారించి కఠినంగా శ్రమిస్తూ నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. అక్కడున్న ఒక కోచ్ నాతో.. 'అతడు మారిన మనిషి' అని చెప్పాడు. అవును.. ఇప్పుడు నేను దానిని స్వయంగా ఆస్వాదిస్తున్నా.. రియాన్ పరాగ్ 2.0" టీ20లలో వరల్డ్ నంబర్‌వన్ బ్యాటర్‌గా ఉన్న సూర్యకుమార్ యాదవ్ గురువారం రాజస్థాన్-ఢిల్లీ మ్యాచ్‌లో రాయల్స్ ఇన్నింగ్స్ ముగిసిన తర్వాత చేసిన ట్వీట్ అది. అవును.. పరాగ్ ఇప్పుడు మారిన మనిషి..! ఐపీఎల్‌లో బహుశా రియాన్ పరాగ్ ఎదుర్కొన్నంత ట్రోలింగ్ మరే క్రికెటర్ అనుభవించలేదంటే అతిశయోక్తి కాదేమో. 17 ఏండ్ల వయసులోనే (2019లో) ఈ లీగ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన పరాగ్.. ఆట కంటే ఎక్కువ 'అతి' తోనే ట్రోలర్స్‌కు, మీమ్ పేజీలకు సరుకుగా మారాడు. ఎక్స్ (ట్విటర్)తో పాటు మీడియాలో అతడు ఏం మాట్లాడినా నెటిజన్లు ఆటాడుకునేవాళ్లు. 'ఆట కంటే అటిట్యూడ్ ఎక్కువ' అంటూ పరాగ్‌పై సోషల్ మీడియా ముద్ర వేసింది. వాళ్ల విమర్శలకు తగ్గట్టు ఫీల్డ్‌లో ఈ అస్సాం కుర్రాడి వ్యవహార శైలి పలుమార్లు వివాదాస్పదమైంది. గత సీజన్‌లో దారుణంగా విఫలమైన (7 మ్యాచ్‌లలో 78 రన్స్) అతడిని రాజస్థాన్ అనవసరంగా భరిస్తుందని, వేలానికి వదిలేయడం ఉత్తమమని ఉచిత సలహాలూ ఇచ్చిన వారూ లేకపోలేదు. అంతకుముందు మూడు సీజన్లలో (183, 93, 86)నూ ఆ జట్టుకు ఆడిన దాదాపు మొత్తం మ్యాచ్‌లలో ఉన్న పరాగ్.. తన మార్కును చూపలేకపోయాడు. బ్యాట్‌తోనే సమాధానం..గతమెలా ఉన్నా ఐపీఎల్-17 లో ఆడిన రెండు మ్యాచ్‌ల ద్వారా పరాగ్ ఎంతో మెరుగయ్యాడనేది అతడి ఆటను చూసినవారికి అనిపించక మానదు. 2023 సీజన్ దాకా రాజస్థాన్ అతడిని ఫినిషర్‌గానే వాడింది. కానీ ఈ సీజన్‌లో అతడు నాలుగో స్థానంలోకి ప్రమోషన్ పొందాడు. లక్నోతో జరిగిన తొలి మ్యాచ్‌లో ఆ జట్టు 49 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయిన దశలో బ్యాటింగ్‌కు వచ్చి శాంసన్‌తో మూడో వికెట్‌కు కీలకమైన 92 పరుగులు జోడించాడు. ఢిల్లీతోనూ రాజస్థాన్ కష్టాల్లో (36/3) ఉన్నప్పుడే వచ్చి బౌలర్లు విజృంభిస్తున్న వేళ ఓపికగా ఆడాడు. తొలి 26 బంతుల్లో అతడు చేసింది 26 పరుగులే. కానీ 15 వ ఓవర్ తర్వాత మొదలైన విధ్వంసం నోకియా వేసిన చివరి ఓవర్లో శిఖరాగ్రానికి చేరింది. ఇంతవరకూ ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ కూడా ఆడని ఓ కుర్రాడు.. అగ్రశ్రేణి బౌలర్‌గా ఉన్న నోకియా బౌలింగ్‌లో 25 పరుగులు రాబట్టాడు. నోకియా 144 కిలోమీటర్ల వేగంతో వేసిన బౌన్సర్‌ను దీటుగా ఎదుర్కొని డీప్ మిడ్‌వికెట్ మీదుగా సిక్సర్ బాదిన షాట్‌ను చూసి తీరాల్సిందే. 26 బంతుల వరకూ బాల్‌కు ఒక్క పరుగు అన్నట్టుగా చేసిన పరాగ్.. 45 బంతుల్లో 84 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.పరిణితితో కూడిన ఆట..ఈ రెండు మ్యాచ్‌లలోనూ పరాగ్ పరిణితితో కూడిన ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఢిల్లీతో మ్యాచ్‌లో బౌలర్లు విజృంభిస్తున్న వేళ వికెట్‌ను కాపాడుకున్న అతడు.. ఆఖర్లో జూలు విదిల్చి తన జట్టుకు భారీ స్కోరును అందించాడు. ఆటతో పాటు పోస్ట్ మ్యాచ్ ప్రెజెంటేషన్‌లో పరాగ్ మాట్లాడే తీరులోనూ పరిణితి కనిపించింది.

# దంచేసిన కేకేఆర్.. ఆర్సీబీపై కోల్‌కతాదే పైచేయి



**బెంగళూరు:** వారం రోజుల క్రితమే మొదలైన ఐపీఎల్-17లో భాగంగా సొంత ఇలాఖాలో ఆడుతున్న మ్యాచ్‌లను ఆతిథ్య జట్లే గెలుస్తూ వస్తున్న సంప్రదాయానికి తెరపడింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు.. తమ సొంత గ్రౌండ్ అయిన చిన్నస్వామి స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్ చేతిలో చిత్తైంది. టాస్ ఓడి ముందు బ్యాటింగ్ చేసిన బెంగళూరు.. విరాట్ కోహ్లీ (59 బంతుల్లో 83 నాటౌట్, 4 ఫోర్లు, 4 సిక్సర్లు) వరుసగా రెండో అర్థ సెంచరీ సాధించడంతో నిర్ణీత 20 ఓవర్లలో ఆ జట్టు 6 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేసింది. భారీ ఛేదనలో కోల్‌కతా.. 16.5 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి 186 పరుగులతో ఈ సీజన్‌లో వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. వెంకటేశ్ అయ్యర్ (30 బంతుల్లో 50, 3 ఫోర్లు, 4 సిక్సర్లు), సునీల్ నరైన్ (22 బంతుల్లో 47, 2 ఫోర్లు, 5 సిక్సర్లు), శ్రేయ స్ అయ్యర్ (24 బంతుల్లో 39 నాటౌట్, 2 ఫోర్లు, 2 సిక్స ర్లు) లు చిన్నస్వామిలో మెరుపులు మెరిపించారు. సునీల్ నరైన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.కోహ్లీ నిలకడ..టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు వచ్చిన ఆర్సీబీకి ఈ సీజన్ మూడో మ్యాచ్‌లోనూ ఆశించిన ఆరంభం దక్కలేదు. కెప్టెన్ డుప్లెసిస్ విఫలమయ్యాడు. డుప్లెసిస్ నిరాశపరిచినా కోహ్లీ.. గ్రీన్‌తో జతకలిసి కేకేఆర్ బౌలర్లను ఆటాడుకున్నాడు. ఈ ఇద్దరూ స్టార్క్, నరైన్‌లను లక్ష్యంగా చేసుకుని బ్యాట్‌కు పనిచెప్పడంతో పవర్ ప్లేలో ఆర్సీబీ స్కోరు పరుగులెత్తింది. 42 బంతుల్లోనే ఈ జోడీ 65 రన్స్ జోడించింది. గ్రీన్‌ను రసెల్ 9వ ఓవర్ చివరి బంతికి క్లీన్‌బౌల్డ్ చేసి పార్ట్‌నర్‌షిప్‌ను బ్రేక్ చేశాడు. 19 బంతుల్లో 3 బౌండరీలు, ఒక సిక్సర్ సాయంతో 28 పరుగులు చేసి టచ్‌లోకి వచ్చినట్టే కనిపించిన మ్యాక్స్‌వెల్.. ఎక్కువసేపు నిలువలేకపోయాడు. ఓ వైపు క్రమం తప్పకుండా వికెట్లు పడుతున్నా కోహ్లీ మాత్రం పరుగుల వేటను ఆపలేదు. 36 బంతుల్లో అతడి అర్ధ సెంచరీ పూర్తయింది. ఆఖర్లో దినేశ్ కార్తీక్ (8 బంతుల్లో 20, 3 సిక్సర్లు)తో వేగంగా ఆడిన కోహ్లీ.. ఆర్సీబీ స్కోరును 180 మార్క్ దాటించాడు.కేకేఆర్ ధనాధన్బెంగళూరు భారీ స్కోరే చేసినా 'చిన్నస్వామి'లో కేకేఆర్ దూకుడు ముందు లక్ష్యం చిన్నబోయింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్, సునీల్ నరైన్‌లు ఆర్సీబీ బౌలర్లను ఉతికారేశారు. సిరాజ్ మొదటి ఓవర్లోనే సాల్ట్.. రెండు సిక్సర్లు, ఓ బౌండరీతో 18 రన్స్ రాబట్టాడు. జోసెఫ్ వేసిన మూడో ఓవర్లో రెండు సిక్సర్లు బాదిన నరైన్.. ఆరో ఓవర్లో యశ్ దయాల్‌పై దయ లేకుండా విరుచుకుపడ్డాడు. ఈ ఓవర్లోనూ 21 పరుగులొచ్చాయి. పవర్ ప్లే ముగిసే సరికే కేకేఆర్ వికెట్ నష్టపోకుండా 85 పరుగులు చేసింది.పని ముగించిన 'అయ్యర్'లుపవర్ ప్లే ముగిశాక వరుస ఓవర్లలో ఓపెనర్లు నిష్క్రమించినా వెంకటేశ్ అయ్యర్, శ్రేయస్ అయ్యర్‌లు మిగతా పని పూర్తిచేశారు. జోసెఫ్ 11వ ఓవర్లో వెంకటేశ్.. 6, 4, 6, 4తో రెచ్చిపోయాడు. 30 బంతుల్లోనే అతడి ఫిఫ్టీ పూర్తయింది. అర్ధ సెంచరీ తర్వా త అతడు పెవిలియన్ చేరినా శ్రేయస్ విన్నింగ్ రన్స్ సాధించాడు.గౌతీ, కోహ్లీ భాయ్ భాయ్ఎప్పుడూ ఉప్పునిప్పులా ఉండే గౌతం గంభీర్, విరాట్ కోహ్లీ ఒక్కటయ్యారు! చిన్నస్వామి స్టేడి యంలో మ్యాచ్ సందర్భంగా గౌతీ, కోహ్లీ కలివిడిగా కనిపించారు. టైమ్ ఔట్‌లో ఇద్దరు కలిసి సరదాగా నవ్వుతూ మాట్లాడుకున్నారు. ఇప్పుడు ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.241 సిక్సర్లు: ఆర్సీబీ తరపున అత్యధిక సిక్సర్లు బాదిన క్రిస్ గేల్ రికార్డు (239)ను కోహ్లీ అధిగమించాడు.2016 నుంచి ఇప్పటిదాకా విజయం.

# బెంగళూరుపై కోల్ కతా ఏడు వికెట్ల తేడాతో విజయం

ఐపీఎల్-2024 టోర్నీలో శుక్రవారం రాయల్ చాలెంజర్స్ బెంగళూరుపై జరిగిన మ్యాచ్ లో కోల్ కతా నైట్ రైడర్స్ ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. 183 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన కోల్ కతా నైట్ రైడర్స్ బ్యాటర్లు చెలరేగి ఆడారు. ఫిల్ సాల్ట్ తో కలిసి బ్యాటింగ్ కు వచ్చిన ఓపెనర్ సునీల్ నారాయణ్ కేవలం 22 బంతుల్లో ఐదు సిక్సర్లు, రెండు ఫోర్లతో 47 పరుగులు చేసి డాగర్ బౌలింగ్ లో బౌల్డయి పెవిలియన్ బాట పట్టాడు. తర్వాత బ్యాటింగ్ కు వచ్చిన వెంకటేశ్ శ్రీఅయ్యర్ నిలకడగా ఆడుతుండగా 30 పరుగుల వద్ద ఫిల్ సాల్ట్ ఔటయ్యాడు.తర్వాత వచ్చిన సారధి శ్రేయస్ అయ్యర్ జత కలవడంతో వెంకటేశ్ అయ్యర్ చెలరేగి పోయాడు. కేవలం 30 బంతుల్లో నాలుగు సిక్స్ లు, మూడు ఫోర్లతో అర్ధ సెంచరీ చేసుకుని యాష్ దయాల్ బౌలింగ్ లో కోహ్లీకి క్యాచ్ ఇచ్చి పెవిలియన్ బాట పట్టాడు. తర్వాత వచ్చిన రింకూ సింగ్ తో కలిసి శ్రేయస్ అయ్యర్ జట్టును విజయ తీరాలకు చేర్చారు. 19 బంతులు మిగిలి ఉండగానే మూడు వికెట్లు కోల్పోయి 186 పరుగులు చేసిన కోల్ కతా నైట్ రైడర్స్ విజయం సాధించింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు బౌలర్లలో యాష్ దయాల్, మయాంక్ డాగర్, విజయ్ కుమార్ శాంక్ ఒక్కో వికెట్ తీశారు.



## ఓటమి తట్టుకోలేక.. రాకెట్‌ను నేలకేసి కొట్టిన పీవీ సింధు.. వీడియో



**హైదరాబాద్:** మాడ్రిడ్ స్పెయిన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీలో పీవీ సింధు క్వార్టర్స్ మ్యాచ్‌లో ఓటమిపాలైంది. థాయిలాండ్‌కు చెందిన సుపనిద కేటితాంగ్ చేతిలో సింధు పరాజయం చవిచూసింది. అయితే ఓటమి తట్టుకోలేక సింధు .. గేమ్ ముగిశాక తన చేతుల్లో ఉన్న రాకెట్‌ను నేలకు కొట్టింది. ఈ ఘటనను నిర్వాహకులు సీరియస్‌గా తీసుకున్నారు. ప్రవర్తన సరిగా లేని కారణంగా.. పీవీ సింధుకు ఎల్లో కార్డు జారీ చేశారు. చైర్ అంపైర్ ఆ కార్డు జారీ చేశాడు. ప్రవర్తన సరిగా లేని షట్లర్లకు ఎల్లో కార్డు జారీ చేస్తుంటారు. ఆరో సీడ్ సుపనిద కేటితాంగ్ 24-26 21-17 22-20 స్కోరుతో వీపీ సింధుపై విజయం సాధించింది. తొలి గేమ్ 4-8 తేడాతో వెనుకబడి ఉన్న సింధు ఆ తర్వాత తన జోరును పెంచి తొలి గేమ్‌ను 24-26 తేడాతో కైవసం చేసుకున్నది. టోర్నీ నుంచి స్పెయిన్ క్రీడాకారణి కరోలినా మారిన్ తప్పుకోవడంతో ..పీవీ సింధు టోర్నీ ఫెవరేట్‌గా నిలిచారు.

## క్రికెట్ ఆడిన కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి.. వీడియో

**పోరుబందర్:** కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి మన్సూక్ మాండవీయ్య క్రికెట్ ఆడారు. గుజరాత్‌లోని పోరుబందర్‌లో ఆయన స్థానికులతో కలిసి కాసేపు మైదానంలో గడిపారు. 51 ఏళ్ల మాండవీయ .. పోరు బందర్ స్థానం నుంచి లోక్‌సభకు పోటీ చేస్తున్నారు. పార్లమెంట్‌కు సైకిల్‌పై వచ్చిన ఈయనకు గ్రీన్ ఎంపీగా పేరు ఉన్నది. బ్లాక్ టీషర్ట్ ధరించిన మంత్రి మాండవీయ.. బౌలింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్ చేశారు. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్ బౌలింగ్ చేశాడు. ఔట్ ఫీల్డ్‌లో కాసేపు ఫీల్డింగ్ చేశాడు. బ్యాటింగ్‌లోనూ భారీ షాట్లు కొట్టే ప్రయత్నం చేశాడు. కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ శాఖకు కూడా మంత్రిగా ఉన్న ఆయన..






మ్యాచ్ ముగిసిన తర్వాత స్థానిక ఆటగాళ్లతో కరాచలనం చేశాడు. 2002లో ఎన్నికైన గుజరాత్ యువ ఎమ్మెల్యేగా ఆయన రికార్డు క్రియేట్ చేశారు. 2012లో ఆయన గుజరాత్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2016 నుంచి ఆయన రవాణాశాఖ, షిప్పింగ్, ఫెర్టిలైజర్స్ శాఖలకు సహాయమంత్రిగా చేశరు. 2018లో ఆయన మళ్లీ రాజ్యసభకు ఎన్నికయ్యారు. మాండవీయ పశువైద్యం కూడా చేస్తారు. 2021లో కోవిడ్ సంక్షోభ వేళ ఆయన కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

## స్టార్క్ బౌలింగ్‌లో స్టన్నింగ్ సిక్సర్ కొట్టిన కోహ్లీ.. వీడియో



**బెంగుళూరు:** ఈ ఏడాది ఐపీఎల్‌లో.. ఆర్సీబీ బ్యాటర్ విరాట్ కోహీటాప్ ఫామ్‌లో ఉన్నాడు. తన బ్యాటింగ్ ట్యాలెంట్‌తో ఆకట్టుకుం టున్నాడు. శుక్రవారం కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కోహ్లీ హాఫ్ సెంచరీ చేశాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా.. కోహ్లీ మాత్రం తన బ్యాటింగ్ స్కిల్‌తో జట్టుకు భారీ స్కోరును అందించాడు. అయితే కోల్‌కతా బౌలర్ మిచెల్ స్టార్క్ బౌలింగ్‌లో కోహ్లీ కొట్టిన ఓ సిక్సర్ అందర్నీ షాక్‌లోకి నెట్టేసింది. 24 కోట్ల పెట్టి మిచెల్ స్టార్క్‌ను కోల్‌కతా కొన్న విషయం తెలిసిందే. ఆ జట్టు ప్రధాన బౌలర్ అయిన స్టార్క్‌ను చాలా ఈజీగా కోహ్లీ ఆడేశాడు. గుడ్‌లెన్ బంతిని ఫ్లిక్ షాట్‌తో సిక్సర్‌గా మలిచాడు. కోహ్లీ ఆ షాట్ ఆడిన తీరుపై కామెంటేటర్లు మెచ్చుకున్నారు. వాట్ ఏ షాట్ .. లుక్ ఎట్ దట్ బాటమ్ హ్యాండ్ అంటూ గవాస్కర్ కామెంట్ చేశాడు. రసవత్తరంగా సాగిన మ్యాచ్‌లో చివరకు కోల్‌కతా విజయం సాధించింది.

## వసూలీ టైటాన్స్.. వివాదంలో టీమ్ఇండియా ఆల్‌రౌండర్ పూజా వస్త్రకార్




**ముంబై:** భారత మహిళా క్రికెట్ జట్టు ఆల్‌రౌండర్ పూజా వస్త్రకార్ పొలిటికల్ పోస్టుతో వివాదంలో చిక్కుకుంది. దేశంలో సార్వత్రిక ఎన్నికల వేళ ఆమె.. కాంగ్రెస్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఓ ఫొటోను తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పోస్ట్ చేయడం చర్చనీయాంశమైంది. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్ వంటి బీజేపీ ప్రముఖులు ఒక క్రికెట్ జట్టుగా ఉన్న మార్ఫ్‌డ్ ఫొటోతో 'వసూలీ టైటాన్స్' అని సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్న పోస్ట్‌ను షేర్ చేసింది.అంతేగాక ఈ పోస్టుకు 'ఇంపాక్ట్ ప్లేయర్: ఈడీ' అని జత చేసింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పలువురు ప్రతిపక్ష నాయకులను ఈడీ అదుపులోకి తీసుకుంటున్న నేపథ్యంలో వస్త్రకార్ చేసిన ఈ పోస్ట్‌పై నెట్టింట భిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి. వస్త్రకార్ పోస్ట్ నెట్టింట వైరల్ అయిన కొద్దిసేపటికే ఆమె దీనిని తొలిగించింది. మరోవైపు ఇన్‌స్టాగ్రామ్‌లో తన ప్రమేయం లేకుండా వచ్చిన పోస్ట్‌పై పూజ..ప్రధాని మోదీకి క్షమాపణలు చెప్పింది.


## స్పెయిన్ మాస్టర్స్ టోర్నీ.. సెమీస్‌లో సిక్కి, సుమిత్



**మాడ్రిడ్:** మాడ్రిడ్ స్పెయిన్ మాస్టర్స్ టోర్నీలో భారత జోడీ సిక్కిరెడ్డి, సుమిత్‌రెడ్డి సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ క్వార్టర్స్‌లో సిక్కి, సుమిత్ ద్వయం 14-21, 21-11, 21-17తో రేహాన్ నౌఫల్, లిసా అసు కుసుమవతి(ఇండోనేషియా) జంటపై అద్భుత విజయం సాధించింది. 41 నిమిషాల పాటు జరిగిన పోరులో సిక్కి, సుమిత్ మెరుగైన ప్రదర్శన కనబరిచారు.

# హీరో నితిన్‌కు స్పెషల్ బర్త్‌డే విషెస్ తెలిపిన

## 'రాబిన్‌హుడ్' టీమ్




టాలీవుడ్ హీరో నితిన్ , వెంకీ కుడుముల కాంబోలో వస్తున్న తాజా చిత్రం రాబిన్‌హుడ్ . భీష్మ సినిమా తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో ఈ సినిమా వస్తుండటంతో ప్రేక్షకులలో భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అయితే నేడు నితిన్ పుట్టినరోజు కావడంతో మూవీ నుంచి స్పెషల్ బర్త్‌డే విషెస్ తెలిపారు మేకర్స్.ఈ సినిమా నుంచి నితిన్‌కు బర్త్‌డే విషెస్ తెలుపుతూ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. ఇక ఈ పోస్టర్‌లో నితిన్ కమాండర్ గెటప్‌లో మాస్ లుక్‌లో అలరిస్తున్నాడు. అయితే నితిన్ ఈ సినిమాలో దొంగగా కనిపించబోతున్నాడు. నటకిరిటీ రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్ ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యేర్నేని, రవి శంకర్ నిర్మిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రానికి సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫర్ కాగా.. ప్రవీణ్ పూడి ఎడిటర్. రామ్ కుమార్ ఆర్ట్ డైరెక్టర్.మరోవైపు ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ కీలకపాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. నితిన్‌కు ఉన్న పాన్ ఇండియా మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని సంజయ్‌దత్ ఈ సినిమాకు తీసుకున్నట్లు టాక్ నడుస్తుంది. దీనిపై చిత్రయూనిట్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.



## 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' దర్శకుడితో సందీప్ కిషన్ కొత్త సినిమా..

## టైటిల్ ఏంటంటే?



'ఊరుపేరు భైరవకోన' సినిమాతో ఈ ఏడాది హిట్ కొట్టాడు టాలీవుడ్ హీరో సందీప్ కిషన్. వి.ఐ.ఆనంద్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం ఫిబ్రవరి 16న విడుదలై రూ.40 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమా అనంతరం మరో క్రేజీ ప్రాజెక్ట్ అనౌన్స్ చేశాడు సందీప్. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' 'మిషన్ ఇంపాసిబుల్' లాంటి సూపర్ హిట్ సినిమాలు తీసిన స్వరుప్ ఆర్ఎస్‌జే దర్శకత్వంలో సినిమా చేయబోతున్నాడు. ఈ సినిమాకు వైబ్ అని టైటిల్ పెట్టాగా.. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు.వైబ్ ఫస్ట్ లుక్ గమనిస్తే.. ఫ్రెండ్షిప్ బ్యాక్‌గ్రౌండ్‌లో ఈ సినిమా రానున్నట్లు తెలుస్తుంది. మనం చాలా మందిని కలుస్తాము, కొంతమందిని ,మర్చిపోతాం, కొంతమందిని గుర్తుంచుకుంటాం, కొంతమంది కోసం మాత్రమే పోరాడతాం. కొంతమంది స్నేహితులు మాత్రం నీ కోసం ఫైట్ చేయడానికి రెడీగా ఉంటారు అంటూ ఈ పోస్టర్ కింద మేకర్స్ రాసుకోచ్చారు. ఇక ఈ సినిమాను మళ్ళీరావా, ఏజెంట్ సాయి శ్రీనివాస్ ఆత్రేయ, మసూద.. లాంటి బ్లాక్ బస్టర్ చిత్రాల నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా నిర్మిస్తున్నాడు.

## పవన్ కల్యాణ్ బ్లాక్ బస్టర్ టైటిల్‌తో వస్తున్న నితిన్.. ఇంట్రెస్టింగ్‌గా ఫస్ట్ లుక్ పోస్టర్



టాలీవుడ్ హీరో నితిన్ పుట్టినరోజు నేడు. ఈ సంద`ర్భంగా అబి,మా నులతో పాటు సినీ ప్రముఖులు నితిన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. అ యితే నితిన్ బర్త్ డే సందర్భంగా తాను నటిస్తున్న కొత్త ప్రాజెక్ట్ నుంచి టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమా తమ్ముడు అనే టైటిల్‌తో వస్తుండగా.. ఈ చిత్రానికి 'వకీల్ సాబ్' ఫేమ్ వేణు శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్నాడు.

ఇక తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్, టైటిల్ లోగో విడుదలైంది. ఇక ఈ పోస్టర్‌లో నితిన్ మాస్ లుక్‌లో అదరగొడుతున్నాడు.ఇక ఈ పోస్టర్ గమనిస్తే.. నితిన్ బస్‌పై కూర్చొని సుబ్రమణ్య స్వామి ఆయుధం పట్టుకుని కనిపిస్తున్నాడు. ఇక నితిన్ గత చిత్రాలకు భిన్నంగా.. చాలా క్రియేటివ్‌గా ఇ పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. కాంతార, విరూపాక్ష చిత్రాల సంగీత దర్శకుడు అజనీష్ లోక్‌నాథ్ ఈ చిత్రానికి మ్యూజిక్ అందిస్తుండగా.. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌లో దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నాడు.

## మీ హద్దుల్లో మీరుంటే మంచిది..

### దాన్నే నిజం అనుకుంటే ఎలా?

## : రాశీఖన్నా



'తెరపై కనిపించేవన్నీ నిజాలు కావు. కేరక్టర్ పండించే క్రమంలో సాటి నటుడితో కాస్త క్లోజ్‌గా ఉంటాం. అది వృత్తి ధర్మం. దాన్నే నిజం అనుకుంటే ఎలా?' అంటూ చిరుబురులాడింది ఢిల్లీ భామ రాశీఖన్నా. సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి ఆమె నటించిన 'యోధ' చిత్రం ఇటీవలే విడుదలై మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. ఈ సినిమాలో సిద్ధార్థ్‌మల్హోత్రతో రాశీఖన్నా స్క్రీన్ కెమిస్ట్రీపై బాలీవుడ్ మీడియాలో తీవ్రమైన చర్చ నడుస్తున్నది. కొందరు నెటిజన్స్ అయితే, వీరిద్దరూ ప్రేమలో ఉన్నట్టు రాసేస్తున్నారు. తాజాగా ఈ వ్యవహారంపై రాశీఖన్నా స్పందించింది. నేను ఇంట్రావర్ట్. సిద్ధార్థ్ మల్హోత్రా కూడా ఇంట్రావర్ట్. ఇద్దరివీ త్వరగా కలిసే మనస్తత్వాలు కావు. ఇద్దరం ఢిల్లీకి చెందిన వారమే. దాంతో మా ప్రాంతం గురించి మాట్లాడుకునేవాళ్లం. అది కూడా అరుదుగానే. పైగా మేమిద్దరం పరిచయస్తులం కూడా కాదు. ఇక కెమెరా ముందుకొస్తే పాత్రోచితంగా నటించడం మా బాధ్యత. 'యోధ'లో కథ అవసరం మేర నటించాం. తెరపై మా ఇద్దరి కెమిస్ట్రీ బావుందంటే, బయట కూడా అలాగే ఉంటాం అని కాదు. మా హద్దులు మాకు తెలుసు. మీ హద్దుల్లో మీరుంటే మంచిది' అంటూ ఘాటుగా స్పందించింది రాశీఖన్నా.

# మేడమ్ టుస్సాడ్స్‌లో బన్నీ మైనపు బొమ్మ..

## మ్యూజియంకు క్యూ కట్టిన ఇన్‌ఫ్లూయెన్సర్స్

'పుష్ప'తో పాన్ ఇండియా ఇమేజ్ సొంతం చేసుకున్న అల్లు అర్జున్, ఆ సినిమాతోనే ఉత్తమనటుడిగా జాతీయ అవార్డును అందుకొని, తెలుగులో ఆ క్రెడిట్ సాధించిన తొలి హీరోగా నిలిచారు. ఆరుసార్లు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు. ప్రస్తుతం అభిమానులకు ఆయన ఐకాన్ స్టార్. ఇప్పుడు బన్నీ కీర్తికిరీటంలోకి మరో కలికితురాయి వచ్చి చేరింది. ప్రపంచప్రఖ్యాతి చెందిన వారి మైనపు బొమ్మలను ఏర్పాటు చేసే ప్రతిష్టాత్మక మ్యూజియం దుబాయ్‌లోని బ్లూ వాటర్స్ దగ్గర ఉన్న మేడమ్ టుస్సాడ్స్. ఆ మ్యూజియం వారు టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ మైనపు బొమ్మను తమ మ్యూజియంలో ఏర్పాటుచేశారు.

ఈ బొమ్మను చూడటానికి మీడియా వారితోపాటు ఎంతోమంది ఇన్‌ఫ్లూయెన్సర్స్ మ్యూజియంకు లైన్ కట్టారు.ఈ మైనపు బొమ్మ పర్‌ఫెక్ట్‌గా రావడానికి అల్లు అర్జున్ నుంచి 200 రకాల కొలతలను సేకరించామని సంస్థ జనరల్ మేనేజర్ తెలిపారు.

ఈ మ్యూజియంలో మైనపుబొమ్మ ఏర్పాటు చేయడం పెద్ద గౌరవం అని, ఈ గౌరవం పొందిన తొలి సౌత్ ఇండియన్ నటుడు అల్లు అర్జునే అని వారు తెలిపారు. రీసెంట్‌గా అల్లు అర్జున్ కూడా తన మైనపు బొమ్మను సందర్శించి, నిజంగా తనను తాను అద్దంలో చూసుకుంటున్నట్టు ఉందని, రియలిస్టిక్‌గా చేశారని సంస్థవారిని ప్రశంసించారు.



## రౌడీ హీరోది ప్రేమ వివాహమేనట!




ఏ విషయంలోనైనా సరే సూటిగా తన అభిప్రాయాల్ని వ్యక్తం చేస్తారు అగ్ర హీరో విజయ్ దేవరకొండ. దాపరికం లేకుండా ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడటం ఆయన నైజం. ప్రస్తుతం విజయ్ దేవరకొండ తన తాజా చిత్రం 'ఫ్యామిలీ స్టార్' ప్రమోషన్ కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. ఈ సందర్భంగా తమిళనాడులో ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో సినిమా విశేషాలతో పాటు తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు విషయాలపై విజయ్ దేవరకొండ మాట్లాడారు. పెళ్లి గురించి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ 'నేను ప్రేమ వివాహమే చేసుకుంటా. పెళ్లి చేసుకొని తండ్రి కావాలని ఉంది. అయితే నా పెళ్లికి ఇంకా టైముంది.నేను పెళ్లాడబోయే అమ్మాయి నా పేరెంట్స్‌కు తప్పకుండా నచ్చాలి' అన్నారు.

# పవన్ కల్యాణ్ బ్లాక్ బస్టర్ టైటిల్‌తో వస్తున్న నితిన్..

## ఇంట్రెస్టింగ్‌గా ఫస్ట్ లుక్ పోస్టర్

టాలీవుడ్ హీరో నితిన్ పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా అభిమానులతో పాటు సినీ ప్రముఖులు నితిన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. అయితే నితిన్ బర్త్ డే సందర్భంగా తాను నటిస్తున్న కొత్త ప్రాజెక్ట్ నుంచి టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. టాలీవుడ్ హీరో నితిన్ పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా అభిమానులతో పాటు సినీ ప్రముఖులు నితిన్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. అయితే నితిన్ బర్త్ డే సందర్భంగా తాను నటిస్తున్న కొత్త ప్రాజెక్ట్ నుంచి టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమా తమ్ముడు అనే టైటిల్‌తో వస్తుండగా.. ఈ చిత్రానికి 'వకీల్ సాబ్' ఫేమ్ వేణు శ్రీరామ్



Published and Printed by Vulloju Srinivas On Behlf of Sri Veena Publications Printed at Telalangana Veena Fiat NO: 204 Mythri Apartments, Opp Bsnl Office Edil Kapra, Med Responsibble for Selection of News Under The PRB ACT, Phone Number: 040 35658720, RNI Reg NO: TELTEL/12280 Reproduction in Whole or in Part Without Written